


సూళ్ళూరుపేట

శ్రీ చెంగాళమ్మ చరిత్ర




తలుపులు లేని తల్లి
నా తలపులలో నిల్చి
నన్ను తట్టి లేపి
నాలో ప్రేరణ కలిగించి
ఈ చరిత్రకు రూపకల్పన చేయించిన
దేవీ శ్రీ చెంగాళమ్మ పవిత్ర పాదపద్మములకు
అంజలి ఘటిస్తూ - ఈ చరిత్రను

- ఆర్. ఎమ్. ఆంజనేయులు



బ్రహ్మోత్సవములలో జరిగే
ళ్ల ఉత్సవ వేడుక - ఇన్ సెట్ సుడిమానుకి కట్టిన నల్ల మేక పి



గర్భ గుడికి చేయించిన తలుపు చెక్కలను
తనలో విలీనం చేసుకొన్న మహావృక్షం!



1933 సంవత్సరం జరిగిన బ్రహ్మోత్సవములలో
మహిషాసుర మర్దని అలంకారంలో
సింహ వాహనా రూఢమైన శ్రీ చెంగాళమ్మ.
గుఱ్ఱపు వాహనంమీద గ్రామ శక్తి అంకమ్మ దేవత.
నాటి ధర్మకర్తలు అరవ భూమి కృష్ణారెడ్డి,
అరవ భూమి రామచంద్రారెడ్డి (ధోవతి, కోటు,
తలపాగా తో నిలబడి వున్న వారు.)



1965 వ సంవత్సరం శ్రీ చెంగాళమ్మ ఆలయ
కళ్యాణ మండప శంకుస్థాపన మహోత్సవ
సందర్భంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా

శరన్నవ రాత్రి మహోత్సవములలో
దేవీ ప్రత్యేక అలంకారములు



పరమేశ్వరి



శ్రీ రాజరాజేశ్వరి -



బాలా త్రిపురసుందరి

ఎందరో మహానుభావులు . . .

నెల్లూరుజిల్లా, సూళ్ళూరుపేట దక్షిణ పొలిమేర్లలో కాళంగినదీతీరాన స్వయంభూజాతగా అవతరించి, సర్వ జనావళికి పిలిస్తే పలికే ప్రత్యక్ష దేవతగా వెలుగొందుతున్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవి ఆవిర్భావమును గురించి మహిమోపేతయైన ఆ తల్లి ఇక్కడ, ఎప్పుడు, ఎట్లా ఉద్భవించినది? అనేందుకు ఆధారాలుగల చరిత్ర అంటూ ఏమీ కనుపించడంలేదు!

కానీ! దేవీ మహిమలను గురించి, చిన్ననాటినుండి పలువురు పెద్దల మూలంగా విన్న కొన్ని ఆసక్తికరమైన దేవీగాథలు, నా మదిలో ఎప్పుడూ మెదల్తుండేవి!

ఆ జగన్మాత సన్నిధికి వెళ్ళి, ఆ చల్లని తల్లిని సందర్శించిన ప్రతి సమయంలో, దేవీగాథలు స్మృతి పథంలో మెరసి, నాలో ఒక ఉత్సాహము, ఉద్వేగము, స్పందన కలిగేది. ఏదో ఒక అదృశ్యశక్తి దేవీ చరిత్రపట్ల నాలో ఆసక్తిని కలిగించి ప్రేరణ కలిగించేది. ఆ అదృశ్యశక్తి ప్రేరణవల్లనే దేవీ చరిత్ర పరిశోధనను నేను చేపట్టవలసి వచ్చింది.

పైగా ఇక్కడ దేవీ బ్రహ్మోత్సవములలో ప్రత్యేక పద్ధతులలో జరిగే 'సుడి' ఉత్సవములు 'మహిషాసుర మర్ధన' జరిగేతీరు, నన్ను తర్క వితర్కాలలో ముంచి ఆలోచనా తరంగాలలో ఓలలాడించి, నన్నీ చరిత్ర సేకరణకు ప్రేరేపించాయి....ఈ విషయాలపట్ల ఆసక్తితో పరిచయమున్న స్థానిక పెద్దలతో సంప్రతించి వారినుండి లభించిన అమూల్యమైన సమాచారా

లనుబట్టి యీ తల్లి చరిత్ర సేకరించాలనే పట్టుదల నాలో గాఢంగా రూపొందినది.

ప్రధానంగా శ్రీ చెంగాళమ్మ ఆలయచరిత్ర సేకరణలో పూజ్యులు స్వర్గీయ శ్రీ ఆరవభూమి రామచంద్రారెడ్డిగారితో నాకు ఏర్పడిన అనుబంధం వల్ల, వారినుండి నాకు లభించిన దేవీ చరిత్రకు చెందిన సమాచారం ఎంతో అమూల్యమైనది. అదే విధంగా వారి సోదరులు అరవభూమి కృష్ణారెడ్డిగారు, ఆలయప్రధాన పూజారి కీసరపల్లి ఆదినారాయణశెట్టి మున్నగువారినుండి ఎన్నో విషయాలు లభించాయి. ఇక శతాధిక వృద్ధులు శ్రీ కళత్తూరు వీరాస్వామిరెడ్డిగారు (వీరు శతవత్సరాలు జీవించి ఇటీవలనే మరణించారు) నాలో ఉత్సాహానికి ప్రోత్సాహం కలిగించి ఎంతో ఓపికతో వృద్ధాప్యంలో కూడా ప్రతి సంఘటనను జ్ఞప్తిలో వుంచుకొని తమ అనుభవాలను కొన్ని నిదర్శనలతో నాకు వివరించారు. ఇలాటి మహామహులెందరో వెల్లడించిన వాస్తవ సంఘటనలే యీ చరిత్ర రూపకల్పనకు ముఖ్యమైన ఆధారం.

ఈ పరమేశ్వరీదేవి చరిత్రకు మూలాధారం లేకున్నప్పటికీ, నేను సేకరించిన సమగ్ర సమాచారాన్ని, ఆ తల్లి ప్రేరణతోనే మీ ముందుంచుటకు సాహసించాను. విజ్ఞులైన సాహితీవేత్తలు, పెద్దలు నా యీ సాహసాన్ని సహృదయంతో స్వీకరించి మన్నిస్తారని ఆశిస్తూ, ఈ చిరు చరిత్రలోని ఆ తల్లి మహిమలను గ్రహించి నా ప్రయత్నానికి ప్రోత్సాహమిచ్చి ఆశీర్వదించవలసిందిగా అర్థిస్తున్నాను.

ఈ చరిత్ర వెలుగుచూసే సదవకాశాన్ని కలిగించిన వదాన్యులు, నిరంతరం దేవీ సేవా కార్యక్రమములలో నిమగ్నులై ఆ తల్లి తలపులలో సర్వదా మెలగుతున్న ఆదర్శ సోదరులు శ్రీ వేనాటి మునిరెడ్డి శ్రీ రామచంద్రారెడ్డిగార్ల దీక్షాదక్షతలు, ప్రజాహిత కార్యాలపట్ల వారికున్న మక్కువతో వారు నిర్వహిస్తున్న ప్రజోపయోగమైన ప్రయోజనాత్మక పలు కార్యక్రమాలను అభినందిస్తూ.. ఆ లోకబాంధవి శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవిని ఆ సోదరుల నిస్వార్థ నిరుపమాన నిష్కళంక సేవలను సర్వదా పొందుతూ వారి కుటుంబాలపై తన చల్లని వెన్నెలలాంటి కృపాకటాక్షలను ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

శ్రీ చెంగాళమ్మ చరిత్ర విషయాన్ని గూర్చి ప్రస్తుత ఆలయ కార్య నిర్వహణాధికారి శ్రీ పులిచెర్ల సూర్యనారాయణరెడ్డిగారు మాటల సందర్భంలో నాతో చర్చించినప్పుడు నేను విన్న గాధలను నా మనోభావాలను వారికి సూక్ష్మంగా వివరించాను. దేవీ చరిత్రకు చెందిన ముఖ్యాంశములను విన్న శ్రీ పులిచెర్ల సూర్యనారాయణరెడ్డిగారు స్పందించి నన్నీ చరిత్ర వ్రాయవలసిందిగా ప్రోత్సహించడమే కాక, ఈ విషయాన్ని ఆలయ ట్రస్టుబోర్డు ఛేర్మెన్ శ్రీ వేనాటి మునిరెడ్డిగారికి, వారి సోదరులు శ్రీ రామచంద్రారెడ్డిగార్ల దృష్టికి తెచ్చారు. వారు నన్ను పిలిచి చరిత్ర సమాచారాన్ని గూర్చి తెలుసుకుని ఆసక్తితో పరిశీలించి.... యీ చరిత్రను పుస్తక రూపంలో ప్రకటించి దేవీ భక్తులకు సమర్పించేందుకు తమ సుముఖత వెల్లడించి నాలో ఉత్సాహన్ని మరింత పెంచారు.

తర్వాత ఒక మారు రాష్ట్ర సరిహద్దులలోని పన్నంగాడు దగ్గర శ్రీ చెంగాళమ్మ ఆలయానికి అనుబంధంగా శ్రీ హనుమాన్ ఆలయ నిర్మాణ శంఖుస్థాపన మహోత్సవ సందర్భంగా విచ్చేసిన దేవాదాయ కమీషనర్ శ్రీ పార్థసారధిగారు ఈ చరిత్ర విషయం తెలిసి నన్ను పిలిపించి చరిత్రలోని

అంశాలను కొన్ని పరిశీలించి చరిత్రను దేవాదాయశాఖ ద్వారా పుస్తకంగా విడుదల చేసేందుకు తమ అంగీకారం వెల్లడించి, చరిత్రను తమకు యివ్వవలసిందనీ తగు పారితోషికం యిస్తామని ప్రకటించారు. నేను ఈ చరిత్రను ఆ తల్లి ప్రేరణతోనే రూపొందించగలిగాను. అందువల్ల ఈ చరిత్రను ఆలయ పాలకవర్గం సహకారంతో, వేనాటి సోదరుల ఔదార్యంతో పుస్తకం విడుదల చేసి, ఆ దేవీమూర్తికే సమర్పించాలనే నా సంకల్పాన్ని వారికి విన్నవించాను... శ్రీ పార్థసారధిగారు ఎంతో సంతోషించి.........అయితే యీ ప్రాంతంలోని కొన్ని ప్రాచీన ఆలయాల వివరాలను నా నుండి విని....ఆ ఆలయాల సమగ్ర చరిత్రను సేకరించి "ప్రాచీన ఆలయ సంపద" అనే పేరుతో రూపొందించాల్సిందిగా అమూల్యమైన సలహాయిచ్చి ఆశీర్వదించి ప్రోత్సహించారు.

ఇంతమంది విజ్ఞులైన పెద్దలు నాలో కల్పించిన ఉత్సాహంతోనే ఆ తల్లి మహిమలను అనేకం సేకరించి సమర్పిస్తున్నాను. యీ చరిత్ర రూపకల్పనకు దోహదంచేసి పుస్తకరూపంలో భక్తులకు సమర్పించేందుకు ఆర్థిక సహకార మందించిన శ్రీ వేనాటి సోదరులకు, యీ చరిత్రను పూర్తి చేయమని పదేపదే ప్రోత్సహించిన ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ పులిచెర్ల సూర్యనారాయణరెడ్డిగారికి, నేని చరిత్ర రచన చేపట్టిన విషయం విని, ఎంతో ఆనందంతో ఆశీర్వదించి ఆ దేవీ స్తోత్రమును శ్లోకములలో రచించిన బహు గ్రంధకర్త, వేదశాస్త్రి పండితులు బ్రహ్మశ్రీ తెలికిచెర్ల రాజేశ్వర శర్మవారికి నమోవాకములు.

ఇంకా ... ప్రత్యక్షంగా ... పరోక్షంగా సహకరించి తమ అమూల్య సలహా సహకారాలందించిన ఎందరో మహానుభావులకు శత సహస్ర వందనాలు, . .

—ఆర్. ఎమ్. ఆంజనేయులు



శ్రీ స్వరూపిణి కామేశ్వరీ నమోస్తు

త్రిపుర సుందరి భువనేశ్వరి నమోస్తు

దీనబాంధవి భూతేశ్వరీ నమోస్తు

శ్రిత జనావని పరమేశ్వరీ నమోస్తు

శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీ స్తోత్రము

శ్రీ కాళింది నదీ మధ్యే శిలా సైకత మధ్యగాం।
బాలకై ర్వీక్షితాం శీఘ్రం ఉత్సాహాత్ కథితంపురే॥

* * *

చెంగాళాం మాతరం వందే రుద్రవామేస్థితాముమాం।
లక్ష్మీం రాజేశ్వరీ రూపాం వాణీం సృష్ట్యాది కారిణీమ్॥

* * *

మహిషాసుర సంహర్త్రీం భక్తాభీష్ట ప్రదాయినీం।
సూళ్ళూరుపేటికా సంస్థాం ప్రజాపాలన తత్పరామ్॥

* * *

కవాట హీన నిలయాం ప్రజాకామప్రదాం శివాం
నిత్యదర్శన పూజాదికారిణాంతోషదాయినీమ్॥

* * *

పరా పరాఖ్య శక్త్యేదం సృష్టం బ్రహ్మాండ మద్భుతం॥
సవితుః చతుర్థ భాగస్య తేజసోఽగ్రేముదావహామ్॥

* * *

ఇయమిచ్ఛాక్రియా జ్ఞాన రూపా త్రిపుర సుందరీ
బాలా చండీ భద్రకాళీ రక్తబీజాదినాశినీ॥

* * *

ఆర్యమ్ ఆంజనేయస్య వాంఛయా రచితంమయా
టి. రాజేశ్వరశర్మాఖ్య పండితేన తురంముదా॥

ఇతిశమ్:- తెలికిచర్ల రాజేశ్వరశర్మ
వేదశాస్త్ర పండితులు.

చరిత్ర పుటల్లో శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి

పూర్వం దండకారణ్య ప్రాంతంగా వ్యవహరిస్తున్న ఈ ప్రదేశంలోని కాళింది నదీతీరంలో బంగాళాఖాతము, పులికాట్ సరస్సులకు పశ్చిమ దిశలో "శుభగిరి" అనే చిన్న గ్రామం వుండేది. ఆ గ్రామ చెరువు గట్టు మీదున్న ఒక పెద్ద వటవృక్షం క్రింద గుబురైన ముళ్ళపొదలలో పుట్ట ఒకటి వుండేదనీ పుట్టకు సమీపంలో ముద్దమందారం, పచ్చగన్నేరు, కస్తూరి, తెల్లని పుష్ప గుచ్చాలతో మిలమిలలాడే నందివర్ధనం మున్నగు వివిధ రంగులలో సుగంధ సౌరభాలను విరజిమ్ముతున్న ఫల, పుష్ప, లతాతరువులు, పొదరిండ్ల మధ్య ఒక శివలింగం వెలసివుండేవి.

ప్రకృతి రామణీయకతతో విరాజిల్లుతున్న ఆ ప్రశాంత వాతావరణ ప్రదేశంలో వున్న పుట్టలో పెద్ద నాగ సర్పం నివసిస్తూ, ఆ ప్రాంతంలో సంచరిస్తున్నదనే వదంతి భయంతో ఆ పరిసర ప్రాంతంలో ప్రజలు యధేచ్ఛగా సంచరించేవారుకారు..... ఈ కారణం మూలంగా అక్కడున్న శివలింగాన్ని గురించి పట్టించుకొనే వారెవ్వరూ లేకపోవడంవల్ల, పరమశివుని ప్రతిరూపంగా పవిత్రంగా భావించే శివలింగం, నిశ్శబ్ద వాతావరణంలో ఆలనా పాలనా లేక ముళ్ళపొదల మరుగునపడి వుండేది.

ఉదయ భానుని నులివెచ్చని కిరణాల వాడితో, వీచే చిరుగాలులకు మిలమిల మెరుస్తూ, పసిడి కాంతులు విరజిమ్ముతున్న గన్నేరు, తెల్లని రజిత కాంతులతో గుభాళిస్తున్న నందివర్ధనం, త్రినేత్రుని కోపాగ్ని జ్వాలల్లా ఎర్రని రంగు ప్రసరిస్తున్న ముద్దమందారం, కస్తూరి పుష్పాలు గుత్తులు గుత్తులుగా జలజలా శివలింగంమీద రాలుతూ పరమేశ్వరునికి పుష్పాభిషేకం చేస్తుండేవి.

ప్రతి నిత్యం ఉషోదయ సమయంలో అక్కడున్న పుట్టలోనుండి ఒక పెద్ద నాగసర్పం వెలుపలికి వచ్చి చెట్ల గుబుర్లలోనుంచి సర సరా జర్రున ప్రాకుతూ వెళ్ళేది. అలా కొంత దూరం వెళ్ళిన పిమ్మట అరుణోదయ వెలుగు కాంతులలో సర్పం అంతర్థానమైపోయి అక్కడ పన్నెండేళ్ళ బాలుని రూపం ప్రత్యక్షమై... ప్రశాంతంగా ఆ సమీపంలో కాళిందీ, సరస్వతీ (పాముల కాలువ) నదులు సంగమం అయ్యే ప్రదేశంలోని పవిత్ర జలాశయంలో ఈ బాలకుడు శుచిగా స్నానమాచరించి చిన్న పాత్రలో ఆ జలోదకాన్ని తీసుకొని నొసట విభూది రేఖలతో బాల కుమారస్వామివలె వెలుగొందుతూ వచ్చి పూపొదరిండ్లలో ప్రవేశించి అక్కడున్న శివలింగానికి భక్తిప్రపత్తులతో అభిషేకమొనర్చి అదృశ్యమైపోయేవాడనీ....అనంతరం ఒక పెద్ద నాగసర్పం శివలింగానికి అగ్రభాగంలో చుట్టుకొని పడగవిప్పి గొడుగులా సూర్యభగవానుని వేడికిరణాలు సోకకుండా పరమేశ్వరునకు నీడ ఏర్పడేలా పడగపట్టేదని అలా నాగసర్పంతో అభిషేక, పూజా సేవలందుకుంటున్న ఈ మహేశ్వరుని శివలింగం ఉదంతం నానాట యీ ప్రాంతంలో ప్రచారం కావడంవల్ల నాటి చోళరాజులు ఈ పరమేశ్వరుని తిలకించి, భక్తి శ్రద్ధలతో ఆలయం నిర్మించి నిత్య నైవేద్య పూజాకైంకర్యములు నిర్విఘ్నంగా జరిగే ఏర్పాట్లు చేసినట్లు ప్రతీతి.

నాగసర్పంచే గంగాభిషేకంతో పూజలందుకున్న మహేశ్వరుని ప్రతిరూపమైన పవిత్ర శివలింగంతోబాటు పార్వతీ దేవిని కూడా ప్రతిష్ఠింప జేశారనీ, నాటినుండి ఇక్కడ వెలసివున్న పరమేశ్వరుని "గంగా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి"గా పేర్కొనడం జరిగినట్లు జనశృతి.

నాటినుండి ఈ ఆలయం భక్తుల అధ్యాత్మిక చింతనకు నిలయంగా రూపొంది విశిష్ఠమైన ప్రశస్తితో కలకలలాడుతూ భక్తుల సందడితో వైభవంగా విలసిల్లుతూ వుండేదని తెలుస్తోంది.

ఆనాడు శివాలయంలో నిత్యాభిషేక, త్రికాల పూజలు, వేదఘోషలతో అత్యంత ప్రాభవంతో వెలుగొందుతున్న పార్వతీపరమేశ్వరులకు నిత్యం సుగంధ ద్రవ్యాలతో జరిగే అభిషేకజలం ఆలయ అంతర్భాగము నుండి సుగంధ సువాసనలతో వెలువడి ప్రవహించే పసుపునీరు ఆలయ ఉత్తర దిశగా వెలుపలికి వచ్చి అటునుండి పశ్చిమంగా ఇప్పటి విద్యాలయ దక్షిణ భాగంలో రైల్వేఫీడర్స్ రోడ్డు ప్రక్కగా ప్రవహిస్తూ నేటి జాతీయ రహదారి చిన్న వంతెన క్రింద నుండి నెర్రికాలువలో కలసిపోయేది. ఈ కాలువ ప్రదేశాన్ని 'మంజాం' కాలువ అని ఇప్పటికీ స్థానికులు వ్యవహరిస్తున్నారు. 'మంజాం' కాలువ అనగా పసుపు నీటి కాలువ అని తమిళంలో అర్థం.

ఆనాడు మహోన్నత వైభవప్రాభవములతో శోభస్కరంగా వెలుగొందుతున్న ఈ శైవ క్షేత్రములో గిరిరాజతనయ పార్వతీదేవి వెలసివుండడంవల్ల 'శుభగిరి' అని వ్యవహరించేవారు. అలాగే దక్షయజ్ఞ సమయములో అవమానభారంతో ఆత్మాహుతి చేసుకొన్న సతీదేవి అంశమే ఇక్కడ శక్తి విగ్రహంగా రూపొంది దీర్ఘకాలం నదీ సుడిగుండాంలో నీటి అడుగున ఇసుకలో పూడుకొనిపోయి పడివుండిన శిలావిగ్రహం షుమారు అయిదువందల సంవత్సరాల క్రితం కాళందీ వరద ప్రవాహ ఉధృతంతో బయటపడి, పశువుల కాపర్లకు లభించి శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీ దేవిగా ఆవిర్భవించినదనియు, నాటినుండి యీ ప్రాంతాన్ని శుభకరిపురమని వ్యవహరిస్తున్నట్లు కొన్ని ఆధారాల మూలంగా తెలుస్తోంది.

జగన్మాతగా వెలసిన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవి చరిత్ర ఎంతో ఆసక్తిదాయకంగా, భక్తుల అనుభూతులతో నిండి, అనుభవ, నిదర్శన, మహిమలతో పండి, భక్తజనులకొక అపూర్వ కానుకగాను, ఈతల్లి కృపా కటాక్షవీక్షణాలు తమ అదృష్టంగాను యీ ప్రాంతం ప్రజలు భావిస్తున్నారు.

దేవి ఆవిర్భావము

శుభకరి గ్రామానికి పశ్చిమ దిశలో ప్రవహిస్తున్న కాళిందీ నది సమీపములోని పచ్చికబయళ్ళలో పశువులను మేతకు తోలుకొనిపోయే పశువుల కాపర్లు ప్రతి నిత్యం తమ పశువుల మందలను, నదీతీర ప్రాంతంలో కడుపారా మేపి, నదిలో పశువులను శుభ్రంగా కడిగి, తాము నీటి మడుగులో ఉల్లాసంగా మునిగి ప్రొద్దుక్రుంకేవేళకు పశువులను గ్రామాలకు తరిలించేవారు.

ఒకనాడు రాగరంజితమైన సాయంసంధ్యాసమయాన, పశువులు కడుపారా సుష్టుగా మేసి, నది నీటిలో దప్పికి తీర్చుకొని, ఇసుక తిన్నెల మీద విశ్రాంతిగా పడుకుని నెమరువేస్తున్నాయి.

కాపర్లు నదిలో దూకి ఆట పాటలతో ఆనందంగా "ఎలేలో" అంటూ పల్లెపదాలు పాడుకుంటూ ఒకరి మీద మరొకరు నీళ్ళు చల్లుకుంటూ నీటి కాకుల్లా మునకలు వేస్తూ, నీటిలో దాగుడుమూతలు ఆడుతూ, కిలారింపులతో కేరింతలుకొడ్తూ ఒకరినొకరు పట్టుకొనేందుకు నీటిలో మునుగుతూ ఆనంద సాగరంలో తేలియాడుతున్న సమయంలో నీటి లోతులో మునిగి నిలువీత మీద పైకి వస్తున్న ఒక యువకునికి ఎవరో నీటిలో తన కాలు పట్టుకొని గుంజినట్లుండటంతో ఆ యువకుడు అమాంతం గట్టుకువచ్చి, అలుపు తీర్చుకుంటూ నీటి లోపల ఏదోవస్తువు తన కాలుకు తగిలి పట్టుకున్నట్లున్నదని తక్కినవారికి చెప్పగా వీరందరూ కలసి మరలా నీటిలో దిగి జాగ్రత్తగా లోతుకుపోయి ఓ పెద్ద బండలావున్న ఆ వస్తువును పట్టుకొని ఒడ్డుకు చేర్చారు

నల్లగా మిల మిల మెరిసిపోతున్న ఆ రాయి మీద, అప్పుడే శిల్పి చెక్కిన స్త్రీ మూర్తి ఆకారంలో ఉన్న శిలా విగ్రహంగా ఉండడం చూసి ఒక్కక్షణం ఆశ్చర్యంలో మునిగిపోయారు. అనంతరం గట్టుమీద ఉన్న తక్కిన తమ వారందరినీ కేకలువేసి పిల్చి, అందరూ కూడబలుక్కుని, ఆ శిలావిగ్రహాన్ని ఎంతో ప్రయాసతో, పట్టుదలతో భద్రంగా నలువైపులా పట్టుకొని సమీపం లోని గట్టుమీదున్న ఒక పెద్ద రావిచెట్టు క్రిందకు చేర్చి, జాగ్రత్తగా క్రిందకు దింపి అలుపు తీర్చుకున్నారు.

పడమటి కోనలలో అస్తమిస్తున్న సూర్యభగవానుని ఎర్రని కాంతి పుంజాలు ఆ పరిసరములలో ప్రసరిస్తూన్నాయి. ఆకిరణాల సంధ్యాకాంతులలో నల్లని శిలావిగ్రహం బంగారు మలామా చేసినట్లు దగదగా మెరుస్తోంది. పలు రకాల పక్షుల కిల కిలారావములు వింత వింత ధ్వనులతో సంగీతం ఆలాపిస్తున్నట్లు చెట్లమీద తమ గూళ్ళలోకి చేరుతున్నాయి. ఆ సంధ్యారుణ కాంతులు ప్రసరిస్తున్న మనోరంజకమైన వేళ పశువుల కాపర్లకు నదీ గర్భంలో లభించిన ఆ శిలా విగ్రహం అష్ట భుజాలతో, వివిధ రకముల అయుధములను ధరించి, వామపాదం క్రింద ఒక రక్కసుణ్ణి త్రొక్కిపట్టి, చేతిలోని త్రిసూలంతో పొడిచి సంహరిస్తున్న భంగిమలో చండీ మూర్తిలా వున్న ఆ శక్తి విగ్రహాన్ని తమ గ్రామంలోకి తరలించాలని సంకల్పించి కొంతపడి విశ్రాంతి తీసుకున్నారు.

భానుడు అస్తమించాడు. నలువైపులా చీకట్లు ఆవరించాయి. పాడి పశువులు, తమ లేగ దూడలు గుర్తుకువచ్చి పొదుగులో పాలు చేపుకొనడంతో లేచి నిలబడి 'అంబా' 'అంబా' అని రంకెలు వేస్తూ ఇంటి ముఖం పట్టిన వాటి అరుపులు విన్న కాపర్లు తమ కర్తవ్యం గుర్తుకు రాగానే విగ్రహాన్ని అక్కడే చెట్టుక్రిందనే వుంచి పశువులను వెంబడించి గ్రామంవైపు సాగి

పోయారు. అయితే తమకు నదిలో దొరికిన విగ్రహాన్ని తమ పెద్దవారితో చెప్పి మరురోజు ఉదయం గ్రామంలోకి తెచ్చుకోవాలనే తలంపుతో వీరు ఆ రాత్రి గ్రామ పెద్దలకు విగ్రహం లభించిన ఉదంతం వివరించారు. అందులో కొందరు పెద్దలు ఉదయం వెళ్ళి విగ్రహాన్ని చూసిన తర్వాత ఆ విగ్రహం వల్ల గ్రామానికి ఏ అరిష్టాలు కలుగకుండా, శోభస్కరంగా వుండే యడల విగ్రహాన్ని తెచ్చి గ్రామంలో అనువైన స్థలంలో ప్రతిష్టించి గుడి కట్టుకుందామని చెప్పి ఆ రాత్రి ఎవరికి వారు నిశ్చింతగా నిద్రపోయారు. కానీ విగ్రహం దొరికిన యువకులు కొందరు మాత్రం ఆ శక్తి విగ్రహ ధ్యాసలో కలలు కంటూ ఆ రాత్రి గడిపారు.

మరురోజు పొద్దు పొడవగానే రైతులు కొందరు పశువుల కాపర్లతో కలసి ముందు రోజు సాయంకాలం గట్టు మీద చెట్టుక్రింద పెట్టివచ్చిన విగ్రహం దగ్గరకు వచ్చారు.... అయితే తాము ముందురోజు బల్లపరుపుగా పడుకోబెట్టిన విగ్రహం ఎవరో లేపి నిలబెట్టినట్లు దక్షిణాభిముఖంగా నిలబడి వుండడం చూసిన కాపర్లు ఆశ్చర్యంలో మునిగిపోయారు .... తాము పడుకోబెట్టి వెళ్ళిన విగ్రహాన్ని ఎవరో పైకి ఎత్తి నిలబెట్టిపోయి వుంటారని వారిలో వారు తర్కించుకొంటుండగా వీరితోబాటు వచ్చిన గ్రామ పెద్దలు విగ్రహ మూర్తిని తిలకించి ముగ్ధులయి శక్తి రూపంలో ఆకర్షణీయంగా అలరారుతున్న శిలావిగ్రహాన్ని గ్రామంలోకి తీసుకొనిపోయి గ్రామశక్తిగా గుడి కట్టించి పూజించుకోవాలనే తలంపుతో విగ్రహాన్ని అక్కడనుండి తరలించేందుకు ప్రయత్నించారు.... కానీ; విగ్రహం ఏమాత్రం కదలక పోవడంతో విసుగుచెందిన గ్రామస్థులు గ్రామంలోకివెళ్ళి మరుదినం కావలసిన పరికరాలతో వచ్చి విగ్రహాన్ని బండిలో తీసుకొని పోవాలని నిశ్చయించుకొని వెళ్ళారు.

ఆనాటి రాత్రి గ్రామ పెద్దలలో పెద్దయైన ఒక రెడ్డిగారికి ఒక స్త్రీ మూర్తి జ్యోతి రూపంలో కలలో కనిపించి, విగ్రహాన్ని నదీ తీరంలో యధాతథంగావుంచి పూజలు చేసుకోవాలనీ, అక్కడనుండి ఏమాత్రం కదిలించే ప్రయత్నం చేయవద్దని ఆదేశించి అదృశ్యమైనదనీ, మరురోజు ఉదయం రెడ్డి గత రాత్రి తన స్వప్న వృత్తాంతం ప్రజలకు చెప్పి, అందరితో కలసి విగ్రహం నెలకొన్న చోటుకు వచ్చి, అత్యంత శోభతో దేదీప్యమానంగా అప్పుడే చెక్కిన శిలా విగ్రహంలా శక్తి రూపంలో సౌందర్య దేవతలావున్న విగ్రహాన్ని చూస్తున్న రెడ్డి మదిలో రాత్రి తన కలలో కనుపించిన స్త్రీ మూర్తి ఆకారం ఒక్కమారు మెదిలింది. రెడ్డి విగ్రహాన్ని నిశితంగా పరికిస్తూ దిగువ భాగంలో పాదాలవద్ద పట్టుకొని గట్టిగా కదిల్చాడు. విగ్రహం భూమిలో పీఠం వరకు కూరుకొనిపోయి ప్రతిష్ఠ చేసినట్లు నిశ్చలంగా ఏమాత్రం కదలకుండా గట్టిగా నిలబడి వుండడంతో మరోమారు విగ్రహం పై భాగం గట్టిగా పట్టుకొని వూపాడు. ఒళ్ళు జలదరించింది. అంతే భక్తితో సాష్టాంగ నమస్కారాలుచేసి... విగ్రహాన్ని అక్కడే వుంచాలని నిర్ణయించి గత రాత్రి తన స్వప్నంలో కనుపించి దేవి ఆదేశించిన విషయాన్ని, తన అనుభూతిని అక్కడున్నవారికి వివరించాడు... అందరూ కలసి ఆ పరిసర ప్రాంతాలలో ముళ్ళకంచెలు నరికి శుభ్రపరిచి తాత్కాలికంగా విగ్రహం చుట్టూ తడికలతో దడి కట్టి గుడిలా ఏర్పరచి నీడ కల్పించి నిత్యం భక్తితో ఆ శక్తి విగ్రహానికి పూజలు చేసేవారు.

పవిత్రమైన కాళిందీ నదిగా పురాణ ప్రతీతి చెందిన నది నేడు కాళంగీ నదిగా రూపాంతరం చెందినది. ఆ కాళంగీ నది సుడిగుండాలలో పశువుల కాపర్లకు లభించి, వారిచేత గట్టుకు చేర్చబడిన శక్తి విగ్రహం, నది ఒడ్డున ఇప్పుడు గుడి ఏర్పడి వున్న ప్రదేశంలోనే దక్షిణాభిముఖంగా వెలసి యాదృచ్ఛికంగా ప్రతిష్ఠాపన చేసినట్లు అవతరించి ఇక్కడ నెలకొన్న దేవి

మూర్తిని "తెన్‌కాళి" అని వ్యవహరించి పూజించేవారు. "తెన్‌కాళియమ్మ" అనగా దక్షిణకాళి అని తమిళంలో భావం. ఆ తెన్‌కాళియమ్మ నానాటికీ వాడుకలో చెంగాళియమ్మగా రూపాంతరం చెంది, నేడు "శ్రీ చెంగాళమ్మ"గా స్థిరపడి భక్తుల ఆరాధ్య దేవతగా వెలుగొందుచున్నది.

మరోగాథ :-

ఆనాడు యీ ప్రాంతాలను పరిపాలిస్తున్న చోళరాజుకు ఒకనాటి రాత్రి ఒక దివ్య శక్తి జ్యోతి రూపంలో ప్రకాశిస్తూ ప్రత్యక్షమై శుభగిరి దక్షిణ పొలిమేర్లలో, నదీతీరంలో వెలసియున్న దేవతను అక్కడే యథాతథంగా ప్రతిష్ఠించి పూజించవలసినదని హెచ్చరించి ఆ దివ్యశక్తి అదృశ్యమైనదనియు, తర్వాత రాజు ఈ ప్రాంతంలో పశువుల కాపర్లకు నది సుడిగుండాలలో లభించిన శిలా విగ్రహ ఉదంతమును తమ చారుల మూలంగా తెలుసుకొని... తమ మంత్రి సామంతులతోబాటు స్వయంగా యీ ప్రాంతానికి విచ్చేసి, దేవీమూర్తిని సందర్శించి, ముగ్ధుడై స్వప్న వృత్తాంతమును తమ ఆస్థాన పండితులకు వివరించి, వారి సూచన మేరకు విగ్రహాన్ని కదిలించకుండా దేవీ ఆనతిననుసరించి అదే ప్రదేశంలోనే నెలకొల్పి, విగ్రహానికి ఒక చిన్న గర్భగుడిని నిర్మింపజేసినట్లును, అష్ట భుజములతో ఆనందదాయిని రూపంలో కరుణార్ద్రదృక్కులను ప్రసరిస్తూ

సౌందర్య శోభతో ఆకర్షణీయంగా వెలుగొందుచున్న ఈ దేవీ విగ్రహ మూర్తిని తిలకించిన చోళ రాజ్య ఆస్థాన ప్రధానాచార్యులు, మహాలక్ష్మి, మహాసరస్వతి, మహాపార్వతీ దేవేరుల అంశంతో ఆదిశక్తి స్వరూపిణిగా వెలసియున్న యీ దేవి వామభాగంలో పార్వతి అంశం, దక్షిణభాగంలో సరస్వతి అంశం, మధ్య వక్షస్థలంలో మహాలక్ష్మి అంశాలతో అవతరించిన ఈ విగ్రహమూర్తిని, నిశితంగా పరిశీలించి 'త్రికళ' అంశమని భావించి యీ దేవిని కాళీమాతగా అభివర్ణిస్తూ "చెన్‌కాళి" మాత అని పేర్కొన్నట్లు కూడా ఒక కథనం వినబడుతోంది. "చెన్‌కాళిమాత" అనగా సుందర స్వరూపిణి అయిన కాళీ అవతారమనియు, ఆ పేరే నేడు వాడుకలో "చెంగాళిమాత"గా రూపొందినట్లుకూడా కొందరు భావిస్తున్నారు.



దేవీ పూర్వగాథ

హిరణ్యకశ్యపుని వధానంతరం అతని దుహితయైన 'దితి' కుపితయై ఆదిశక్తినిగూర్చి ఘోరమైన తపమాచరించి, త్రిమూర్తులను ఏకకాలంలో జయించగల పుత్రుని తనకు ప్రసాదించవలసినదిగా ప్రార్థించి, తపోప్రభావంతో ఆదిశక్తి అనుగ్రహం పొంది, మహావీరుడైన పుత్రుని బడసెను.

దితి తపో వర ప్రభావంతో జన్మించినవాడే మహిషాసురుడు. యుక్త వయస్కుడైన మహిషాసురుని అహంకార ధాటికి తట్టుకోజాలక త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు భయకంపితులై, ఆందోళనతో ఆదిపరాశక్తిని ఆశ్రయించి ప్రార్థించిరి. వీరి ప్రార్థనలను ఆలకించిన ఆదిశక్తి ప్రత్యక్షమై మహాలక్ష్మి, మహాసరస్వతి, మహాపార్వతీ అంశములతో ఒక జ్వాలా స్వరూపముగా ఆవిర్భవించెను. త్రికళాస్వరూపిణియైన ఆ మహాశక్తి దుర్గ అవతారంలో దుష్టుడైన మహిషాసురునితో నవరాత్రములు ఘోర యుద్ధంచేసి లోకకంటకుడు, మాయాకామరూపుడైన ఆ దనుజుని మహర్ణవమినాడు సంహరించి, ఆదిశక్తి స్వరూపిణియై సర్వశుభములనొసంగు శుభకరిగా సూళ్ళూరుపేటలో శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీ దేవీ రూపంలో వెలసి యున్నట్లు ఒక ప్రాచీన గాథ.

మరోగాథ:-

దితి, కశ్యపుల సంతానాన్ని సంహరించుటకు మహేంద్రుడు ప్రయత్నించగా కశ్యపుడు మాత్రం తన కుమారుల దౌష్ట్యముల నెఱింగి మిన్నకుండెను.

మాతృమూర్తియైన దితి మాత్రము కోపోద్రేకంతో ఇంద్రుని జయింపగల పుత్రుని బడయగోరి, సుపార్శ్వుని ఆశ్రమ సమీపంలో ఆదిశక్తిని ప్రసన్నము చేసుకొనుటకు ఘోర తపమాచరించెను... ఆమె తపోశక్తి జ్వాలాశిఖలై, ఆశ్రమ పరిసరములను దహింపసాగెను. ఆ తపో ప్రభావానికి ఆశ్రమవాసులు తట్టుకోలేకపోయారు... పరిస్థితులను పసిగట్టిన సుపార్శ్వుడు కలతచెంది, ప్రశాంతమైన తన ఆశ్రమ వాతావరణాన్ని భయకంపితంచేసి, కలుషితం చేసిన నీకు మహిషం పుట్టుగాకయని దితిని కోపంతో శపించెను. అయినా దితి తపోదీక్షను విరమించక ఉధృతం చేయడంతో బ్రహ్మ సంతోషించి, ఆమె దీక్షకు మెచ్చి ప్రత్యక్షమై, సుపార్శ్వుని శాప ప్రభావము ననుసరించి, శిరస్సు మాత్రము మహిషాకృతిలో గల పుత్రుని ప్రసాదించెను. అతడే మహిషాసురుడు. మాతృమూర్తి తపోబలంతో శాపగ్రస్థ వర ప్రసాదితుడై జన్మించిన మహిషాసురుడు బాల్యము నుండియు శివభక్తి తత్పరుడై, యుక్తవయస్సులో మహేశ్వరుని ప్రసన్నము చేసుకొన నిశ్చయించి తపోభూములకరిగి పరమేశ్వరుని గూర్చి ఉగ్రతపమాచరించెను.

అతని కఠోర దీక్షా తపఃప్రభావానికి మెచ్చి, సంతుష్టుడై ప్రత్యక్షమైన పరమేశ్వరుని గాంచి మహిషుడు ఆనందంతో, భక్తి పారవశ్యంతో పరమేశ్వరుని స్తుతించి.... "మహేశా! నాకు సకల సురాసురుల చేతగానీ, మానవుల చేతగానీ, పశుపక్ష్యాది ఏ రూపంలోని జీవులవల్లకాని మరణము

లేకుండునట్లుగాను, కామరూప శక్తిగల బలం చేకూరునట్లు" వరమొసంగ ప్రార్థించాడు.

పరమేశ్వరుడు చిరునవ్వుతో.... 'పుట్టిన ప్రతి జీవి గిట్టుట సహజం, కావున వేరొక వరాన్ని కోరుకో'మనగా అహంభావియైన మహిషుడు అబలయైన స్త్రీ వలన తప్ప ఇక ఏ జీవి వల్ల కానీ మరణం లేకుండా శివునిచేత వరప్రసాదితుడయినాడు. వర ప్రభావంతో గర్విష్టియైన మహిషాసురుడు నాటి నుండి ముల్లోకాలను ముప్పుతిప్పలు పెడ్తూ, త్రిలోకాలలో ఇక తన బలానికి ఎదురులేదనే భ్రమతో దేవతలను క్రూరంగా హింసించడం ప్రారంభించాడు. అసురులకు ప్రధమ శత్రువైన దేవేంద్రుని తుదముట్టించాలనే పట్టుదలతో, అమరావతీ నగరమును తన అజరామరమైన శక్తియుక్తులతో ముట్టడించి, ఇంద్రుని జయించి, స్వర్గాన్ని చేజిక్కించుకొన్నాడు. దేవతలు మహిషాసురుని పరాక్రమమునకు తట్టుకోలేక స్వర్గమును వీడి చెల్లాచెదురై, చెట్టుకొకరు, పుట్టకొకరుగా అరణ్యాలలో రహస్యంగా తలదాచుకొని ప్రాణాలు కాపాడుకోవలసిన దుస్థితి ఏర్పడింది.

మహిషాసురుని ఎదిరించి నిలబడగల 'శక్తి' లేక, వాని దౌష్ట్యానికి తట్టుకోలేక, పలాయితులైన దేవతలు, త్రిమూర్తులను ఆశ్రయించి తమ గోడును మొరపెట్టుకొన్నారు. 'దేవదేవా! ఆర్తజన సంరక్షణ పరాయణా! దీనబంధో! ఆశ్రిత జన శరణ్యా! స్వర్గ సీమ మహిషాసురుని వశమైంది, మేమంతా అడవులపాలై అష్టకష్టాలు అనుభవిస్తున్నాము. ఇక మాకు దిక్కెవరు? లక్ష్మీవల్లభా! మాకు అభయమొసంగి, మమ్మల్ని కాపాడు తండ్రీ' అంటూ ముక్తకంఠంతో విష్ణుమూర్తిని ప్రార్థించారు.

పరమేశ్వరుని వరప్రసాదితుడైన మహిషాసురుని సంహరించగల శక్తి ఒక్క స్త్రీమూర్తికి తప్ప మరెవ్వరికీ లేదని యెరింగిన శ్రీ మహావిష్ణువు ఒక లిప్తకాలం బ్రహ్మ, మహేశ్వరుల వదనాలను పరికించాడు.

త్రిమూర్తుల పరస్పర తీక్షణావీక్షణములనుండి ఒక మహాజ్వాలాస్వరూపంతో ఒక కన్యక ఆవిర్భవించినది. త్రిమూర్తుల కళాజ్వాలల నుండి ఉద్భవించినందున ఆమెను 'త్రికళ' యనియు, త్రిమూర్తుల శక్తి స్వరూపంగా జన్మించినందున 'మహామాయ'గా ప్రస్తుతించారు.

బ్రహ్మ ముఖారవిందము నుండి రజిత కాంతులీనుతూ సమశీతోష్ణమైన ఒక దివ్యతేజము వెలువడినది.

సత్వగుణకలితమై దివ్యకాంతులు వెదజల్లుతూ, తెల్లని తేజోపుంజము విష్ణుమూర్తి శరీరం నుంచి ఉద్భవించినది.

అరుణకాంతులు విరజిమ్ముతూ శంకరుని శరీరం నుండి మహా భయంకరమైన తేజం బహిర్గతమైంది.

ఇంద్ర, యమ, వరుణ, అగ్ని, కుబేరాది దేవతల శరీరముల నుండి వివిధ కాంతులీనుతూ పలు తేజస్సులతో ఒక మహా తేజఃపుంజము ఆవిర్భవించినది.

ఈ విధముగా ఏర్పడిన ఆ మహాతేజోరాశి నుండి ఒక స్త్రీ మూర్తి ఉద్భవించినది. తెల్లని ముఖారవిందంతో, అష్టాదశ బాహువులతో, అగ్ని సంకాశమైన నేత్రత్రయంతో, జగన్మోహన రూపంలో ఆవిర్భవించిన ఆ మూర్తిని తిలకించి సకల దేవతలు, కిన్నెరకింపురుషులు ముగ్ధులై ఆనందంతో

స్తుతించారు. శంఖ, చక్ర, గదా, శూల, పాశ, కాలదండ, పరశు, ముద్గర, ఖడ్గ, ధనస్సు, తూణీరములను, వివిధ ఆయుధములను దేవతలు ఆ పరాశక్తికి సమర్పించి స్తుతించారు.

'జగన్మాతా! నీవు జగత్కల్యాణమొనరింప జన్మించిన ఆదిశక్తివి. సర్వ శుభంకరివి. సంకటహారిణివి. దేవీ! దురహంకారియైన యీ మహిషాసురుని మర్థించి నీ కరుణాకటాక్షవీక్షణ బలముతో మమ్ములను గాచి ముల్లోకములను బ్రోవుము తల్లీ!' యని ప్రార్థించారు.

'సకల శక్తి స్వరూపిణి అయిన ఆ దేవీమూర్తిలోని శుక్ల, కృష్ణ, రక్త వర్ణములను వేరుచేసి, చల్లని వెన్నెలలాంటి చూపులను ప్రసరించి కాపాడు తల్లీ!' అంటూ త్రిమూర్తులు కోరారు.

కృపాసాగరి అయిన ఆ మహాశక్తి దేవతల మొరలాలకించి, తన యందలి బ్రహ్మ 'శక్తి' శ్వేత పర్వతమున తపమొనర్చు సర్వ వస్తు సముదాయము నందుండునట్లు వరమొంది, బ్రహ్మ శరీరములో లీనమాయెను.

ఆమె తనువునందలి 'శివశక్తి' 'రురుడనే' రక్కసుని శిరస్సును మొండెము నుండి వేరు చేసి రెండు తుండెములుగా సంహరించి 'చండీ' మూర్తియైన 'చాముండి'యై విరాజిల్లుచున్నది.

విష్ణుమూర్తి కళాంశమైన దేవి సాత్విక స్వరూపిణియై, మందరగిరి మేరువు మీద 'నారాయణి', 'శ్రీవైష్ణవి' అను నామములతో భక్తుల అభీష్టములను నెరవేర్చుచూ జగన్మోహనాకారిణియై తపమాచరించుచుండెను.

ఈ 'నారాయణీ' వృత్తాంతమును, అందచందములను నారదుని ద్వారా మహిషాసురుడు విని, అట్టి అతిలోక సుందరిని, సౌందర్యరాశిని

తన అర్థాంగిగా స్వీకరింపదలచి, మోహావేశంబున, కామోద్రేక తాపమును సైరింపలేక, తనభృత్యుల ద్వారా, తన మనోరథమును ఆమెకు విన్నవించి, సగౌరవంగా ఆహ్వానింపవలసినదిగా తన భృత్యవీరులను ఆ దేవేరి చెంతకు మహిషాసురుడు బంపెను.

ఈ అహంభావి కోర్కెను నారాయణి విని మనసారా నవ్వుకొని ఆ రాక్షస భటులను తిరస్కరించి త్రిప్పి తరిమి కొట్టినది. ఈ వార్త విని కుపితుడై మహిషాసురుడు క్రోధాగ్నిజ్వాలా భీకరుడై. కదన సన్నాహాలతో గార్ధభ రథంబునెక్కి, తన కామరూపంబున మన్మధుని మరపించు శృంగార వీరునివలె అనంత రాక్షస సేనావాహిని వెంటరాగా రణసన్నద్ధుడాయెను.

ఆ జగన్మోహినియును, కామాగ్నిచే రగులుచున్న యీ మహిషుని జూచి, రోసి, యీసడించి, ఆతనిని తుదముట్టింప సంసిద్ధురాలయ్యెను.

ఆ జగన్మోహినిని గాంచిన మహిషాసురునికి కామావేశము కట్టలు తెంచుకొని, మనసు తడబడి, మాటలు తొట్రుపాటు చెందుచూ తన రథంబు డిగ్గి, ఒక్కడే దేవీ ముందు యెదురేగి "ఓ అపురూప సౌందర్యరాశీ! నా మన్మధ సామ్రాజ్యమేలగల జగన్మోహినీ! నా శౌర్య పరాక్రమములు నీవు వినియే యుందువు. మహేంద్రుని మట్టికరిపించి, అమరాసనమును చేజిక్కించుకొంటిని. త్రిమూర్తులు నా ధాటికి తాళలేక తికమకలుపడి నాకెదురు నిలవలేక పోయిరి. ఈ లోకమున ప్రస్తుతము సురాసురాధి పతిని నేనే. ప్రతి ఒక్కరి పూజను అందుకోవలసినది నేనే. అష్టదిక్పాలురు సైతం దిక్కుతోచక, తమ తమ నెలవులు దప్పి, ప్రాణములను తమ గుప్పిట పెట్టుకొని, నాకు దాసానుదాసులుగా రోజులు వెళ్ళబుచ్చుచున్నారు. అంతటి మహాబల సంపన్నుడు నీపై మక్కువకల్గి, అందరిని దాసానుదాసులుగా చేసుకొన్న యీ

మహిషాసురుడు నీ రతీసామ్రాజ్య భోగలాలసుడనై నిన్ను నా ముఖ్య దేవేరిగా చేసి, ధన్యతబొంద నిచ్చగించి, నీ సౌందర్య దాసుడనై, నీ మదన సామ్రాజ్యమునేలే ఆకాంక్షతో, నిన్ను నా పట్టపు రాణీగా చేయదలచి, నీకు స్వాగతం పలుకుచున్నాడను.''

ఈ మూర్ఖుని మాటలతో దేవి కోపాగ్ని ప్రజ్వరిల్లి "నీచుడా! ప్రాణాలమీద తుది ఆశ వుంటే వెంటనే నీ వాచాలత్వము మాని, పాతాళానికి వెళ్ళి తలదాచుకో, లేదా నిన్ను ఇప్పుడే యిక్కడే యమలోకానికి చేర్చగలను, కాచుకో!''యని స్వాతి మెరుపువలె మెరసి, విశాఖ పిడుగువలె ఒక్క వురుకున ఆతనిపైకి వురికినది.

తన కొన వూపిరి పోవుటకు పొద్దు కూకినదని యెరుంగని మహిషుడు క్రోధంతో సమరభేరి మ్రోగించాడు.

విజయశంఖం మ్రోగిస్తూ, ఆ ఆదిశక్తి త్రిశూల ఖడ్గధారిణియై, అరుణోదయవక్త్రియైన ఆ ఆదిపరాశక్తి మహిషాసురునికి మృత్యుదేవతవలె తోచెను.

దేవి మహిషాసురునిపై శరసంధానంచేస్తే, వాడు గజ రూపం ధరించి ఘీంకరిస్తూ ఒక పర్వత శిఖరాన్ని 'అంబ' మీదికి విసరాడు.

ఆదిపరాశక్తి దానిని మధ్యలోనే త్రుంచివేసి ముక్కలు ముక్కలుగా చేసి వానిపైనే విసరింది. సింహ వాహన రూఢయైన దుర్గ వాహనమైన సింహం పెద్ద ధ్వనితో గర్జించినది. ఆ పెను గర్జనకు లోకాలే తల్లడిల్లాయి. మహిషుడి గుండె గుభేలుమంది శరీరమంతా చెమటమయమయింది. కనుచూపు మందగించింది.

గజాకృతిలోనున్న మహిషుడి కుంభస్థలంపైకి ఉరికింది. విధిలేక, విధివంచితుడైన ఆ నీచ మహిషాసురుడు నిజాకృతింబొంది, నాలుకను జాపి, తోకను ఝాడిస్తూ అరిలోక భయంకరుడై తన యావత్ కుయుక్తి శక్తులను ఉపయోగించి మహా తీవ్రంగా రంకెలు వేస్తూ పోరున కురికాడు.

ఇలా పోరు రోజు రోజుకు తీవ్రమౌతున్నది. లోకాలన్నీ చీకటిమయమైనవి. ఆదిపరాశక్తిని అడ్డుకొను ధీరులెవ్వరు? ఆ అంబ అపూర్వ శక్తిని గ్రహించలేని పరమ మూర్ఖుడు మహిషాసురుడు. అంబను కేవలము ఒక అబలగా తలచి యుద్ధానికి సిద్ధమైనది వానికి పోగాలము దాపురించినందువలననే. రాత్రింబవళ్ళు తొమ్మిది రోజులు తీవ్రంగా జరిగిన పోరు చిట్టచివర రోజు మహర్నవమినాడు ఆ కాళిక వీర దుర్గగా భాసిల్లినది. రవి చంద్రాదులు సైతము గతులు తప్పారు. అష్టదిక్పాలురు అశక్తులై మిన్నకున్నారు. త్రిమూర్తులు లోకపావనీ, జగత్కల్యాణీ, విజయదుఃర్గ అసమాన అపురూప వీరత్వమును చూస్తూ మిన్నకున్నారు. స్వాతి మెరుపువలెనున్న మన అంబ విశాఖ చినుకువలె, మహిషాసురుని కాయాన్ని తన శర పరంపరతో తూట్లు పొడిచినది. సుదర్శనచక్ర ప్రయోగం చేసి మహిషాసురుని శిరస్సు ఖండించినది. మేరు పర్వతంగా మహిషాసురుడు కుప్పకూలాడు. రక్తపు ఏరులు ప్రవహించాయి. అతని మొండెం జీవచ్ఛవమై గిల గిలలాడి, విల విల అతని నుండి వేరై నిస్సహాయ స్థితిలో చైతన్యం కోల్పోయినది. లోక సంకటము తీరినది. సర్వలోకాల పీడ విరిగినది. ముక్కోటి దేవతలు మహిషాసురుని మర్థించి విజయవిహారిణియైన ఆ అందమైన కాళిమాతను జూచి పూలజల్లులు కురిపించారు. వరుణుడు ఆనందం పట్టలేక తరులు, గిరులు సమతలాలలో హర్షంతో వర్షించాడు. నదులు పొంగాయి, వాగులు పొర్లాయి, కాలువలు ప్రశాంతంగా పారాయి, ఆ మహిషాసుర రక్తపుటేరును పూర్తిగా ప్రక్షాళనము చేశాయి నదీప్రవాహ పూర్ణజలాలు.

మహిషాసుర వధానంతరం రక్కసుల బారినుండి దేవతల బానిసత్వాన్ని తొలగించి, స్వర్గంలో ఇంద్రునికి విముక్తిని ప్రసాదించి, అమరాసనాన్ని అధిష్టింపజేసిన మహిషాసుర మర్ధనీని. సర్వశత్రు సంహారిణీ! ఆర్తజనత్రాణపరాయణీ! దీనజనబాంధవీ! లోకపావనీ! జగత్కళ్యాణీ! మమ్ముల నెల్లప్పుడు కావుమమ్మా''అంటూ సకల జనావళి ఆ దేవేరికి అంజలి ఘటించి అనేక విధాల స్తుతించి కీర్తించారు.

(దేవీ పూర్వగాధలకు మూలం దేవీ భాగవతం నుండి సేకరించబడినది.)

తపోబల సంపన్నుడు, కామరూపశక్తిధరుడు, మహాబలశాలి అయిన మహిషాసురునితో నవరాత్రములు సమరంచేసి మాయోపాయంతో వివిధ జంతురూపాలతో తనతో తలపడిన దనుజుని దునుముటకై వుద్భవించిన మహామాయయైన ఈ చండీమూర్తి, మహాలక్ష్మి, మహాసరస్వతి, మహాపార్వతీ సంభూతయైన యీ దేవి, శాంతించి తన ప్రచండ రూపాన్ని ఉపసంహరించుకొని, అష్టాదశ భుజాలను, సకల దేవతాంశములను ప్రకృతిలో లీనంచేసి, ఆయుధాలను మాత్రం తిరిగి ఆయా దేవతలకప్పజెప్పింది. తానుమాత్రము దుర్గాదేవిగా అష్టభుజములతో అలరారుతూ, శాంతస్వరూపిణియై, సౌంద్యరరాశియై సర్వజనులభీష్టములను నెరవేర్చుచూ, సకల జనావళికి సర్వశుభముల నొసగుచూ 'శుభంకరి'యై, శుభకరిపురముననెలవై వెలుగొందుచున్నదనియు, సురుల రక్షణ కోసరం ఆవిర్భవించిన సర్వ శక్తిస్వరూపిణి, సర్వ శత్రు సంహారిణి, సంకటహారిణి, మనోక్లేశదూరిణి, ఆర్తజనత్రాణపరాయణీ. దీనజనకల్పవల్లి, భక్తాభీష్టప్రదాయనీ, త్రికళారూపిణి, ఆదిపరాశక్తి, చండీమూర్తి శ్రీ చెంగాళి పరమేశ్వరీ దేవియేననియు....

ఈనాడు జగన్మాతగా సూళూరుపేటలో భక్తాభీష్టప్రదాయినిగా, వరాల కల్పవల్లిగా, సత్యంగల దేవత, చల్లని తల్లిగా, అశేష భక్తజనకోటిచే అనవరత, అవిశ్రాంత, నిరంతరాయ పూజలందుకొనుచూ, రేయింబవళ్ళు ఆరాధింపబడి ప్రతిఒక్కరి మనోసామ్రాజ్యాధి దేవతగా విరాజిల్లుచున్నదని జనశృతి.

"సర్వ మంగళ మాంగల్యే! శివే! సర్వార్థసాధకే!
శరణ్యేత్ర్యంబకే దేవీ! నారాయణీ నమోస్తుతే!

* * *

లోకాన్ సమస్తా శుఖినోభవంతు!
ఓం శాంతి శాంతి శాంతిః

దేవీ పీఠాలు?

ప్రాణాధికురాలైన అర్ధాంగి సతీదేవి, తండ్రిచేత అవమానితురాలై దక్షుని యజ్ఞకుండంలోనే ఆత్మాహుతి చేసుకొని దగ్ధమైన తర్వాత, కైలాసంలో పరమశివుడు సతీవియోగ దుఃఖం భరించలేక ప్రచండ కోపోద్రేకంతో జటాజూటము నుండి వీరభద్రుని సృష్టించి దక్షుని మీదకు వదిలాడు.

వీరభద్రుడు క్రోధావేశంతో ప్రళయకాల స్వరూపుడై చిందులువేస్తూ దక్షాధ్వరాన్ని ధ్వసంచేసి, యజ్ఞవాటికను సర్వనాశనం చేశాడు. అడ్డం వచ్చిన దక్షప్రజాపతి సర్వ సైన్యాన్ని నాశనం చేశాడు.

క్రోధంతో ఎదురువచ్చిన దక్షుని శిరస్సు ఖండించాడు.

పరమశివుని కోపాగ్ని జ్వాలలనుండి ఉద్భవించిన వీరభద్రుని భీకర సంగ్రామాన్ని, ఆయన భయంకర అకారాన్ని చూసి దేవతలు తల్లడిల్లిపోయారు. వీరభద్రుడు రుద్రునివలె అరివీర భయంకరుడై, ప్రళయ ప్రభంజనమై వీరవిహారం చేస్తున్నాడు.

ముల్లోకాలు వీరభద్రుని ధాటికి తట్టుకోలేక గడ గడలాడాయి.

ఇగ గత్యంతరం లేక బ్రహ్మాది దేవతలందరూ పరమేశ్వరుని సమీపించి, దక్షుని సంహారవార్త విన్నవించి, శరణుకోరి, అభయప్రదానం చేయవలసినదిగా అంజలిఘటించి అర్థించారు.

అర్ధాంగి సతీదేవి ఆహుతితో విషాదసాగరంలో మునిగియున్న పరమేశ్వరుడు తన దుఃఖాన్ని సైతం పరిగణింపక, లోక కల్యాణనిమిత్తం దేవతలకు అభయప్రదానం చేశాడు. అనంతరం బ్రహ్మదేవుని ఆనతి మేరకు మేక తలను తెచ్చి దక్షప్రజాపతి మొండెమునకు అమర్చి దక్షుని పునర్జీవితుణ్ణి చేశారు దేవతలు.

సతీదేవి స్మృతిని మరచిపోలేక ఆమె కొరకు యజ్ఞవాటికకు వచ్చిన పరమశివుడు యజ్ఞకుండం సమీపించి సతీవ్యామోహముతో ఆ ప్రదేశమంతా కలయవెతికాడు.

సతి యజ్ఞకుండంలో దగ్ధమైపోవడంవల్ల, శివుడు చిత్కళా రూపంలోని సతిని భుజంమీద వేసుకొని విషాదంతో ఉన్మత్తునివలె అనేక ప్రదేశాలు, అరణ్యాలు పట్టి తిరుగుతున్నాడు.

సతి వియోగభారంతో పరమేశ్వరుడు ప్రళయనృత్యం చేస్తున్నాడు. త్రినేత్రుని భయంకర కోపాగ్ని జ్వాలలవల్ల త్రిలోకాలలో ప్రళయం సంభవించింది.

జడలు విరబోసుకొని ఉన్మత్తునివలె సతీ చిత్కళా రూపాన్ని భుజం మీదనుండి కదలించకుండా లోకాలన్నీ తిరుగుతూ నర్తిస్తున్నాడు శివుడు.

రుద్రుని ప్రళయరూపం చూసి బ్రహ్మాది దేవతలు దిక్కుతోచకుండా చింతాక్రాంతులయ్యారు.

విష్ణుమూర్తిని అర్థించి మహేశ్వరుని సతీవియోగ భారంనుండి విముక్తుణ్ణి చేసి లోకాన్ని కాపాడవలసిందిగా ప్రార్థించారు.

శివుని భుజం మీద వున్న సతీ రూపం వేరుకానిదే మహేశుడు మరల మన లోకంలోకి రాడని, సతి చిక్కలారూపాన్ని పరమేశ్వరుని నుండి వేరుచేయడం తప్ప వేరు గత్యంతరం లేదని భావించిన మహావిష్ణువు ధనువు చేత ధరించి సంధించి, సతీదేవి మృతదేహాన్ని ముక్కచెక్కలు చేశాడు.

ఆ శరాఘాతంతో ఛిద్రమైన సతి మృత శరీర ఖండాలు దేశవ్యాప్తంగా అనేక ప్రదేశాలలో పోయి పడ్డాయి. సతి అంగములు పడిన ప్రతి ప్రదేశంలోను పరమేశ్వరుడు వెలిశాడు. అన్ని ప్రదేశాలలో పరమశివుడు తపస్సు చేశాడు.

అవి పవిత్ర క్షేత్రాలయ్యాయి. ప్రతి క్షేత్రములో ఒక దేవీ పీఠం వెలసింది. ఆ పవిత్ర పుణ్య స్థలాలన్నీ సిద్దపీఠాలుగా వెలుగొందుతున్నాయి.

మొట్టమొదటగా సతీదేవి వదనం వారణాశిలో పడింది. అక్కడ వెలసిన దేవి, విశాలాక్షిగా వెలుగొందుతూ పవిత్ర శైవక్షేత్రంగా, పుణ్యభూమిగా విరాజిల్లుచున్నది.

ఆ విధముగా నూట ఎనిమిది ప్రదేశాలలో సతీదేవి అంగాలు పడ్డాయి. ఆ నూట ఎనిమిది ప్రదేశాల్లో శక్తి పీఠాలుగా, సిద్ధపీఠాలుగా నూటఎనిమిది పేర్లతో దేవీ అంశాలు వెలిశాయి.

అష్టోత్తర శత నామాలతో వెలసిన పీఠాలను దేవీ పీఠాలుగా పేర్కొన్నారు. ఆ దివ్య పీఠాలలోని దేవీ పేర్లతో, అష్టోత్తర శత నామాలతో దేవిని స్తుతించి అర్చిస్తున్నట్లు- దేవీ భాగవతంలో ఉదహరించియున్నది.

అలాంటి ప్రదేశాలలో శుభకరిపురి కూడా ఒకటని....ఇక్కడ వెలసివున్న శ్రీ చెంగాళమాత పరమేశ్వరీ దేవి కూడా ఆ అంశంలోని దేవతని కొందరు భావిస్తున్నారు.

ఈ భావనకు కొంత ఆధారంకూడా లభిస్తోంది.

దక్షయజ్ఞం సమయంలో తీరని అవమానభారం భరించలేక ఆహుతైన పార్వతీదేవి అంశమైన సతీదేవి వియోగ క్రోధంతో పరమశివుడు సృష్టించిన వీరభద్రుడు కూడా యీ ప్రదేశంలో వెలసివున్నట్లు స్థానిక ఆధారాలవల్ల వెల్లడైనందున ఈ చరిత్రకు కొంత పుష్టి ఏర్పడింది.

ఈ ప్రాంతంలో వెలసియున్న శ్రీ నాగేశ్వరస్వామి ప్రాచీన ఆలయంతోబాటు యిప్పటి సూళ్ళూరు ప్రాంతంగానున్న ప్రదేశంలో వీరభద్రుని గుడికూడా వున్నట్లు, ఆ ప్రదేశాన్ని 'కుమ్మరిమిట్ట' అని వ్యవహరించేవారని తెలుస్తున్నది.

దీనికి నిదర్శనగా గత రెండు దశాబ్దాల క్రితం సూళ్ళూరులో ఒక గృహ నిర్మాణ నిమిత్తం పునాదులు త్రవ్వుతున్న సమయంలో ఆరడుగుల లోతు పునాదిలో అయిదడుగుల ఎత్తున్న ఒక అందమైన వీరభద్రుని శిలా విగ్రహం బయటపడింది.

కపాలమాల ధరించి, జటాజూటంతో, చేత ఆయుధాలతోవున్న ఆ భారీ విగ్రహ పీఠం కుడివైపు మేక తలతోవున్న దక్షుడుకూడా వుండడం విశేషం.

ఆ విగ్రహం కొంతకాలం స్థానిక తాలూకా కార్యాలయ ఆవరణలో నేరేడు చెట్లక్రింద వుండేది. అనంతరం ఆ వీరభద్రుని నెల్లూరు కేంద్రానికి తరలించి పురావస్తుశాఖ ఆధ్వర్యంలోని మ్యూజియంలో వుంచియున్నారు.

ఇక్కడ ప్రాచీన శివాలయంతోబాటు సమీపంలో వీరభద్రుని గుడి కూడా వుండడంవల్ల, అనంతరం ఇక్కడ వెలసిన శ్రీ చెంగాళమాత పరమే

శ్వరీ దేవి, శ్రీ పార్వతీదేవి అంశమేననీ, ఆమె గ్రామశక్తి మాత్రం కాదనీ, భావించాల్సివుంది.

శ్రీ చెంగాళమ్మ ఆలయంలో మూలవిరాట్టుగా వెలసి పూజలందుకుంటున్న దేవితోబాటు ఈ ఆలయంలోనే అంకమ్మకూడా గ్రామశక్తిగా వెలసివున్నది. గ్రామోత్సవ సమయాలలోను, నిత్య నైవేద్య పూజా కైంకర్యముల సమయాలలో శ్రీ చెంగాళమ్మతోబాటు అంకమ్మ దేవత కూడా పూజలందుకుంటూ సేవింపబడుతోంది. బ్రహ్మోత్సవ సందర్భంలోకూడా ప్రతి రోజు గ్రామోత్సవంలో శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవి వాహనాలంకారముతోబాటు అంకమ్మ గ్రామదేవత ఉత్సవమూర్తినికూడా ప్రత్యేక అలంకారములతో శ్రీ చెంగాళమ్మదేవి వెనుకనే పూరేగింపు జరుపుతారు: ఈ ఆచార వ్యవహారాల మూలంగా జరిగే కార్యక్రమాలను పరిశీలించినప్పుడు ఇక్కడ అంకమ్మే గ్రామదేవతయనీ, శ్రీ చెంగాళమ్మ తల్లి శ్రీ పార్వతీ దేవి అంశంతో వుద్భవించిన దేవతయనీ భావిస్తున్నారు.

దీనికి నిదర్శనంగా గ్రామ దేవతలుగా పూజింపబడుతున్న పోలేరమ్మ, నూకాలమ్మ, గంగమ్మ, అంకమ్మ, యాగాతమ్మ పేర్లతో అనేక చోట్ల వెలసియున్న గ్రామదేవతలకు, ఆయా ప్రాంతాలలో జంతు బలులతో జాతర్లు, కొలుపులు జరుగుతాయి. కానీ, శ్రీ చెంగాళమ్మ దేవికి మాత్రం ఇక్కడ ప్రత్యేక పద్ధతుల్లో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ కారణాలవల్ల కూడా శ్రీ చెంగాళమ్మ గ్రామదేవత కాదని భావించవలసివస్తోంది.

త్రేతాయుగం, ద్వాపర యుగములలో పురాణ ప్రసిద్ధి చెందిన శ్రీహరికోట, మణిమంటప క్షేత్రాలకు చేరువలో కలియుగంలో పార్వతీదేవి అంశంగా సూళ్ళూరుపేటలో అవతరించిన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవి అనన్య మహిమలతో, ప్రత్యక్ష దేవతగా భక్తజనులను పరిరక్షిస్తూ వెలుగొందుతున్న ఆ తల్లి జగజ్జననిగా వైభవ ప్రాభవాలతో, కోరినవారికి కొంగుబంగారమై విలసిల్లుతున్నది.



కలియుగంలో...
కలికి చెంగాళమ్మ మహిమలు

శుభకరి పురంలో కలియుగంలో జగత్కల్యాణిగా అవతరించిన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవి మహిమలు అనన్యం!

భక్తితో సేవించి కొలిచే భక్తులకు ఆ తల్లి కొంగు బంగారం!

సంతానహీనులెందరికో ఆ లోకపావని వరప్రసాది!

పసిబిడ్డల పాలిట పరమౌషధం ఆ అమ్మణ్ణి రక్షాబంధం!

కర్షకుల తలపుల్లో కల్పతరువు ఆ దివ్యశక్తి!

యిలా ఎందరి హృదయాల్లో ఎన్నో అనుభూతులు ప్రసాదించి, ప్రత్యక్షదైవంగా వెలుగొందుతున్న జగన్మాత, శ్రీ చెంగాళమ్మ లీలలు అనంత సాగర తరంగాల్లా, భక్తకోటి మనస్సుల్లో చెరగని ముద్రతో ఓలలాడుతున్నాయ్!

మిర్యాల మాయ

ఆ రోజులలో కలకత్తా, మదరాసుల (మదరాసును ఆనాడు చెన్నపట్నం అనేవారు) మధ్య ప్రయాణం చేయాలంటే నేడు జాతీయరహదారిగా రూపొందిన ప్రదేశంలో కేవలం చిన్న రహదారి బండ్లబాటగా వుండేది. ఆ బాటలో మజిలీలు చేస్తూ ప్రయాణం చేసేవారు. ఈ బాటకు ఇరువైపులా చల్లని నీడ నిచ్చే పెద్ద పెద్ద వటవృక్షాలు, దాని పొడవునా బాటసారులు విశ్రాంతి తీసుకునేం

దుకు ధర్మసత్రాలు. దప్పిక తీర్చుకునేందుకు జలవనరుల్ని నాటి రాజులు నిర్మించారు. అందుకు ప్రబలనిదర్శనంగా నెల్లూరు, మద్రాసు నగరాల మధ్య జాతీయ రహదారి ప్రక్కన యిప్పటికీ అనేక ప్రదేశములలో వున్న శిథిల సత్రాలు .... కోనేర్లు మనకు తార్కాణాలు. ఆంధ్రప్రాంతం నుండి తాము పండించిన వివిధ రకముల ధాన్యాలను రైతులు, వ్యాపారులు ఎడ్లబండ్లమీద మద్రాసుకు ఈ మార్గంగుండానే తరలించేవారు. ప్రస్తుతం కాళంగి నది సమీపంలో బండ్లబాట ప్రక్కన నెలకొనివున్న చిన్న శక్తి గుడి ప్రాంతంలో పెద్దపెద్ద వటవృక్షాలు చల్లని నీడను ప్రసాదిస్తూ చలువ పందిళ్ళవలె వుండేవి. ఆ మార్గంలో ప్రయాణం చేసే బాటసారులు, వ్యాపారులు నదీ తీరంలోని చెట్లనీడలో సేద తీర్చుకొని తాము తెచ్చుకున్న మూటకూళ్ళనుతిని, విశ్రాంతి అనంతరం మరలా ప్రయాణం చేసేవారు. ఆ రోజులలో ఇప్పటివలె దారిలో ఎక్కడపడితేఅక్కడ భోజన వసతి లభించేదికాదు. అసలీ మార్గం కీకారణ్యం లాగా, నిర్మానుష్యంగా వుండేది. అందువల్ల బాటసార్లు జట్లుజట్లుగా కలసి ఎడ్లబండ్లమీద సమూహంగా ప్రయాణాలు చేసేవారు.

ఒకనాడు కొందరు వర్తకులు బండ్లమీద తమ సరకులను వేసుకొని మద్రాసులో విక్రయించి సొమ్ముచేసుకోవాలనే తలంపుతో ప్రయాణంచేస్తూ ఈ ప్రదేశానికి వచ్చేసరికి మిట్టమధ్యాహ్నం కావడం వల్ల ఇక్కడ చెట్ల క్రింద బండ్లు ఆపి, నదిలో స్నానాలు చేసి అక్కడున్న పెద్ద మద్దిచెట్టు నీడలో వంటలు చేసుకొని, సుష్టుగా భోంచేసి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఒక పండుముదుసలి వారి దగ్గరకు వచ్చి "నాయనా! కాస్తా మిర్యాలు వుంటే పెట్టండి బాబూ! తలనొప్పి విపరీతంగా వున్నది. పట్టు వేసుకొని కషాయం కాచుకొని త్రాగుతాను" అని ప్రాధేయపూర్వకంగా అడిగింది. బాటసార్ల సమూహంలో చుట్ట కాల్చుకుంటున్న ఒక వ్యక్తి విసుగుతో 'పో! పోవమ్మా!

మా దగ్గర మిర్యాలు ఎక్కడున్నాయి? అవి జొన్నలు బస్తాలు, మిర్యాలు కావు....పో!' అని తీవ్రంగా గర్జించాడు.

ఇంతలో మరో వ్యక్తి 'పెద్దమ్మా! మా వద్ద మిర్యాలు లేవు, ఇవి జొన్నలు' అని సౌమ్యంగా చెప్పడంతో, ఆ ముదుసలి 'పోనీలే నాయనా! అవి జొన్నలయితే నాకెందుకులే! మిర్యాలు అనుకొని వచ్చి అడిగాను. మీదగ్గర లేనప్పుడు మీరుమాత్రం ఏంచేస్తారులే!' అని అంటూ ఆ వృద్ధురాలు అక్కడనుండి మెల్లగా వెళ్ళిపోయింది.

వృద్ధురాలు అటు కనుమరుగు కాగానే 'పిచ్చిముండ.... మిర్యాలు కావాలట పాపం! ఈ ముండ కోసం బస్తాలు విప్పి పందేరం చేస్తామను కొన్నట్లున్నది. ఇలా దారి పొడుగునా అడిగిన వారికంతా బస్తాలు విప్పి దానంచేస్తూ పోతుంటే ఇక మనకు మిగిలేది ఖాళీ గోతాలే!' అంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ... నవ్వుతూ కొంతసమయం గడిపారు వర్తకులు.

సరకు మిర్యాలయినా జొన్నలని అసత్యం పలికారు వర్తకులు. ఆ తర్వాత వర్తకులు తమ బండ్లతో మదరాసుకు వెళ్ళి, అక్కడ టోకు వర్తకుల గిడ్డంగిలో బస్తాలు దించి, విక్రయ నిమిత్తం వాటిని విప్పిచూచి ఒక్కక్షణం నోటమాట లేకుండా అచేతనులయ్యారు. దీనికి కారణం? వీరు తెచ్చిన బస్తాల్లోని మిర్యాలు జొన్నలుగా మారిపోయి వున్నాయి.

ఈ మాయ ఏమిటో అర్థంగాక అయోమయంలోపడి తేరుకోలేని స్థితిలో మునిగిపోయారు. ఈ విచిత్రమేమిటో బోధపడక వారిలోవారు తర్జన భర్జనలతో చర్చించుకొని, దిక్కుతోచక ఈ ఉదంతాన్నిగూర్చి అక్కడున్న టోకు వర్తకులకుకూడా తెలియపరిచారు. అంతలో ఒక వ్యక్తి రెండు రోజుల క్రితం జరిగిన సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకొని ఇక్కడకు అయిదామడల

దూరంలో ఒక ఏటి ఒడ్డున చెట్లక్రింద తాము వంటచేసుకొని, భోజనానంతరం విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఒక వృద్ధురాలు వచ్చి మిర్యాలు అడగడం... దానికి తాము చెప్పిన అసత్య సమాధానం మున్నగు సంఘటనలను గురించి వివరించాడు.

ఇంతలో ఒక వ్యక్తి అక్కడ చెట్లక్రింద తడికల గుడిలోవున్న గ్రామశక్తి మాయగా వుండవచ్చుననే అనుమానం వెల్లడించడంతో.... వీరందరూ అక్కడి టోకు వ్యాపారులతో కలసి ఆదుర్దాతో ఈ ప్రాంతానికి తక్షణం బయల్దేరివచ్చి, ఇక్కడ బాట ప్రక్కన పెద్ద చెట్టు క్రిందవున్న శక్తి విగ్రహాన్ని తిలకించి, భక్తితో చెంపలు వేసుకొని 'తల్లీ! మా తప్పులను మన్నించి మమ్మల్ని కాపాడు. నీ మహత్తు తెలియక అసత్యాలను పలికి, వాస్తవాలను కప్పిపెట్టిన మా మూర్ఖత్వాన్ని, అమాయకత్వాన్ని క్షమించి, నీ బిడ్డలమైన మమ్మల్ని ఆశీర్వదించి రక్షించు తల్లీ!' అని పలు విధాల భక్తితో ప్రార్థించారు. ఇంతలో వీరితోబాటు మదరాసునుండి వచ్చిన టోకు వ్యాపారులలో ఒక వృద్ధునకు పూనకం వచ్చి వూగిపోతూ 'ఒరేయ్! భయపడకండ్రా! మిమ్మల్ని పరీక్షించాలనే నేను మీకు దర్శనమిచ్చి మిర్యాలు అడిగాను! పొండిరా! పొండి! ఇంకెన్నడూ, ఎక్కడా, ఎవరితో అసత్యాలు చెప్పకండి! వెళ్ళండి! మీ బస్తాలను చూసుకోండి!' అంటూ పూనకంతో వూగిపోతూ, అమాంతం క్రిందపడిపోయాడు.

తమ వ్యక్తి మీదనే దేవీ పూనకం రావడంతో వీరందరూ నిశ్చేష్టులై భక్తితో సాష్టాంగ నమస్కారాలు చేస్తూ, యధార్థాన్ని మరుగునపరచి అసత్యాలు చెప్పినందుకు వేదనతో పదే పదే చెంపలు వేసుకొని, తల్లిని మనసారా ప్రార్థించి, తిరిగి మదరాసు వెళ్ళారు.

అక్కడ తాము వుంచివచ్చిన బస్తాలను చూసి ఆనందంతో నోట మాటరాక ఆశ్చర్యసాగరంలో మునిగిపోయారు!

జొన్నలుగావున్న బస్తాలలో యధాప్రకారం మిర్యాలు మిల మిల మెరిసిపోతున్నాయి.

ఈ విచిత్ర సంఘటనతో దేవీ మహిమను గుర్తించిన వర్తకులు వెంటనే వ్యాపారం పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణంలో మరల ఈ గుడి దగ్గరకువచ్చి ఒక రోజంతా అక్కడే గడిపి, మరుదినం ఈశక్తికి భక్తితో పొంగళ్ళు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకొన్నారు.

మిర్యాల వర్తకులు దేవీ విగ్రహానికి విలువైన పట్టుచీరలు, రవికలు తోబాటు బంగారుతో మిర్యాలహారం చేయించి కానుకగా సమర్పించారు.

తల్లి మహాత్మ్యాన్ని, తమకు జరిగిన అనుభవాలను గ్రామ పెద్దలకు వివరించి, తల్లికి కానుకలుగా సమర్పించిన విలువైన మిర్యాలహారాన్ని రెడ్డికి అందజేసి... శక్తి మహిమలను స్తుతిస్తూ తమ గ్రామాలకు వెళ్ళారు.

ఈ సంఘటనను స్వయంగా తిలకించిన మద్రాసు టోకు వ్యాపారులు కొందరు మరు ఆదివారం యీ దేవి సన్నిధికి తమ కుటుంబాలతో వచ్చి... భక్తితో దేవిని అర్చించి, పొంగళ్ళు పెట్టుకొని, గ్రామ పెద్దలతో సంప్రతించి తాము దేవి గర్భగుడి నిర్మాణానికి అయ్యే ఖర్చును స్వంతంగా భరించగలమని వాగ్దానం చేశారనీ, ఆదే ప్రకారం మదరాసు వర్తకుల విరాళంతో దేవీ గర్భగుడి నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది.

మిర్యాలు, జొన్నల విచిత్రోదంతం నానాట బహుళప్రచారం కావడం మూలంగా యీ దేవీ మహాత్మ్యం గుర్తించి, అనేక కోర్కెలతో భక్తులు విరివిగావచ్చి యీ శక్తిని పూజించేవారు. భక్తుల రాకపోకలతో యీ దేవి గుడి ప్రతి శుక్ర, ఆది, మంగళవారాల్లో బాగా సందడి పుంజుకున్నది.

ఇక ఈమార్గంలో ప్రయాణం చేసే బాటసార్లు, వర్తకులు విధిగా యీ గుడి దగ్గర ఆగి, దేవీమూర్తిని దర్శించి తమ వ్యాపారాలు లాభసాటిగా సాగాలని, పలు కోర్కెలతో మ్రొక్కుకొని, విశ్రాంతి అనంతరం మదరాసు వెళ్ళేవారు. అక్కడ వీరి సరుకుల వ్యాపార లావాదేవీలు సజావుగా సాగి ఆశించిన ఫలితాలు కలగడంతో యీ దేవి మీద ప్రతివారికి ప్రగాఢ విశ్వాసం ఏర్పడింది.

సత్యంగల దేవతగా! భక్తుల పాలిట కల్పతరువుగా శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవి ప్రభావం యీ పరిసర ప్రాంతాలలోనేగాక, ముఖ్యంగా తమిళనాడు ప్రాంతంలో, విరివిగా మదరాసు నగరంలో వ్యాప్తి చెంది భక్తులు అధిక సంఖ్యలోవచ్చి దేవతకు మొక్కుబడులు తీర్చుకొని కానుకలు సమర్పించే ఆనవాయితీ ఏర్పడింది.

మిర్యాలమాయ సంఘటనకు ముగ్ధులైన వర్తకులు ఆనాడు దేవికి భక్తితో సమర్పించిన 'బంగారు మిర్యాలహారం' ఈనాటికికూడా అమ్మవారికి అలంకరిస్తుంటారు.

ప్రధానంగా తమిళనాడు ప్రాంతంలో ఈ శక్తి ప్రభావం వ్యాప్తిచెంది ఆ ప్రాంతాలనుండి విరివిగా వచ్చి భక్తితో ఆరాధించే ఎందరో భక్తులకు ప్రత్యక్షంగా యీ దేవీ మహిమలు, అనుభూతులు కలగడంతో, భక్తుల రద్దీ ఎక్కువైంది. భక్తులు భక్తితో సమర్పించిన చీరలను, సొమ్ములను అమ్మవారికి అలంకరించి, రాత్రి సమయాల్లో కూడా అలాగే వుంచి పూజారులు వెళ్ళేవారు.

తస్కరునికి తగినశాస్తి!

ఒకనాడు శుక్రవారం అమ్మణ్ణికి అభిషేకం చేసి, పట్టుచీర, నొసట తిలకము, వెండి కండ్లు, బంగారు హారలను అలంకరించిన పూజార్లు రాత్రి అలంకారం అలాగేవుంచి వెళ్ళారు.

మిర్యాలహారంతో దగదగా మెరిసిపోతూ ఆకర్షణీయంగా వెలుగొందుతున్న దేవత ఆభరణాలు, వెండి కన్నులు, నొసట తిలకాభరణం, చేతిలో త్రిశూలం, అమ్మణ్ణికి అలంకరించివున్న పట్టుచీరను చూసిన ఒక చోరుడు, ఆ వస్తువులను తస్కరించాలని తలంచి, ఆ రాత్రి అందరూ వెళ్ళిన తర్వాత నిర్మానుష్యంగావున్న గుడిలో ప్రవేశించాడు.

దేవీ మెడలో మెరుస్తున్న మిర్యాలదండమీద చేయివేశాడు.

మినుకు మినుకుమంటున్న చిన్న ఆముదం దీపం గుడ్డి వెలుగులో, కనులు మిరమిట్లుగొల్పుతూ అమ్మణ్ణి రెండు నేత్రాలనుండి జగజ్జేగీయమానంగా వెలుగుకాంతులు తీక్షణమైన జ్వాలలతో చోరుని కళ్ళలోకి ప్రసంరిచాయి.

దేవీ భయంకరమైన కనుచూపులనుండి ప్రసరించిన మెరుపు కాంతుల వెలుగు జ్వాలలకు తస్కరుని కనుచూపు మందగించి, దేవీ పాదాలచెంత పడి స్పృహ కోల్పోయాడు.

సూర్యోదయమవుతోంది.... పెనువృక్షాలమీద వింత పక్షులు దేవికి మేలుకొలుపులు పాడుతున్నట్లు తమ శ్రావ్యమైన వింత కంఠధ్వనులతో కిలకిలారావములతో, రెక్కలు టపటపా కొట్టుకుంటూ శబ్దం చేస్తూ మేతకు బయలుదేరేందుకు సన్నద్ధమవుతున్నాయి.

పక్షుల కోలాహలంతో ఆ ప్రాంతమంతా సందడిపుంజుకొన్నది.

ఉదయం వ్యవసాయపనులకై మాగాణి భూములవైపు వెళ్తున్న రైతులు మామూలుప్రకారం గుడిలో దేవతకు దణ్ణం పెట్టుకొని పోయేందుకు వచ్చారు.

శక్తి విగ్రహ పాదాలముందు పడివున్న వ్యక్తిని చూసి, ముఖంమీద నీరు చల్లారు.

అప్పుడే కొంత తెప్పరిల్లిన చోరుడు కండ్లు తెరచిచూసి, చీకటి గుహలో వున్నట్లు భ్రమించి, రాత్రి జరిగిన సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకుని, దేవీ ఆగ్రహానికి గురై చూపు కోల్పోయినట్లు గ్రహించి, ఏడుస్తూ, తాను తల్లి సొమ్ములు దొంగిలించాలనే దుష్టబుద్ధితో గుడిలో ప్రవేశించి, అమ్మణ్ణి వక్షస్థలంలో మెరుస్తున్న హారంమీద చేయివేయడంతో, పిడుగులు పడినట్లు పెద్ద శబ్దంచేస్తూ, తళుక్కున మెరసిన మెరుపు కాంతితో కిందపడిపోయానని, తల్లి సొమ్ములు దొంగిలించేందుకు సాహసించినందువల్లనే తనకీగతి పట్టినదని తెలిపి, 'తల్లీ! రక్షించు'మంటూ పలువిధాల ప్రార్థించాడు.

ఇంతలో ఈ సమాచారం తెలిసిన గ్రామపెద్దలు, ప్రజలు గుడిదగ్గరకు వచ్చి చోరుని పలువిధాల నిందిస్తూ యీ సంఘటననుగూర్చి భిన్నాభిప్రాయాలతో చర్చించుకుంటున్నారు.

చోరుడు అపారమైన దుఃఖంతో ఏడుస్తూ తల్లి పాదాలను పట్టుకొని గాఢమైన భక్తిపారవశ్యంతో ప్రార్థించాడు.

చల్లనితల్లి వెన్నెలలాంటి కృపాకటాక్షవీక్షణాలతో చోరునికి మరల కనుచూపు వచ్చిందనీ, యీ మహిమతో చోరునిలో పరివర్తన కలిగి దేవీ భక్తుడుగా మారి, చోరవృత్తి మానుకొని, తన శేషజీవితాన్ని దేవీ భక్తి స్తోత్రములతో గడిపి తనువు చాలించినట్లు ఒక వృత్తాంతం.

తల్లి గుడికి తలుపులు లేవు!

ఇది షుమారు మూడువందల సంవత్సరాలనాటి మాట! చోరుని కథనంతో దేవీగుడికి తలుపులు పెట్టాలని తలంచి ప్రయత్నాలు ప్రారంభించిన గ్రామపెద్దలు చెక్కలు తెచ్చి, గర్భగుడికి ద్వారబంధము, తలుపులు చేయించుటకు వడ్రంగులకు పని అప్పగించారు.

మరుదినం ఉదయం శుభముహూర్త లగ్నంలో, ద్వారబంధం పెట్టి తలుపులు ఏర్పరచేందుకు నిర్ణయించారు.

వడ్రంగులు చెక్కలు శుభ్రంగా కొలతల ప్రకారం తోపుడుచేసి, సాయంకాలం కావడంతో గుడి ప్రక్కనవున్న పెద్ద మద్ది చెట్టు మొదట్లో చెక్కలను నిలబెట్టి ఇండ్లకు వెళ్ళారు!

ఆ రాత్రి భక్తిశ్రద్ధలతో ఆదిశక్తి గుడి ఆధిపత్యాన్ని నిర్వహిస్తున్న ఆ గ్రామంలోని పెద్దరెడ్డి కలలో దేవి కనుపించి ఈ మార్గంలో నిరంతరం ప్రయాణంచేసే బాటసారులు ఎల్లవేళలా నిరభ్యంతరంగా నన్ను సందర్శించే అవకాశం లేకుండా, తలుపులుపెట్టి, నిర్బంధించి నా భక్తులకు నా దర్శన భాగ్యం లేకుండా ఆటంకం కలిగించే ప్రయత్నాలు చేయవద్దని హెచ్చరించి' లోకాలను రక్షిస్తున్న తనకు రక్షణ కలిగించాలా? అని ప్రశ్నించినదనియు'

మరుదినం ఉదయం వడ్రంగిపనివారు వచ్చి క్రిందటి రోజు సాయంకాలం తాము తోపుడుచేసి, చెట్టు మొదట్లోఆన్చి నిలబెట్టివుంచిన తలుపు చెక్కలు మద్దిచెట్టులో కలసిపోయి చిగురించినట్లు, కోపులు కోపులుగా చెట్టు మొదట్లో విలీనమైపోయి వుండడంతో, వీరందరూ సంభ్రమాశ్చర్యాలలో

మునిగిపోయి, ఈ వింత సమాచారాన్ని హుటాహుటిగా వెళ్ళి గ్రామంలో రెడ్డిగారికి తెలిపారు.

ఈ వార్త తెలిసిన గ్రామస్థులతోబాటు రెడ్డిగారు ఆఘమేఘాలమీద ఆలయప్రాంతానికి వచ్చి. చెట్టు మొదట్లో చిగుర్లతో కలసిపోయిన తలుపు చెక్కలను చూసి, రాత్రి తన కలలో అమ్మణ్ణి దర్శనమిచ్చి ఆదేశించిన విషయాన్ని గుర్తు తెచ్చుకొని, స్వప్నసమాచారం అక్కడున్నవారందరికీ విశదపరచి, గర్భాలయంలోకి వెళ్ళి సాష్టాంగపడి, భక్తిపారవశ్యంతో చెంపలువేసుకొని....

'తల్లీ! నీ మహిమలు అనంతములు, నీ దివ్యమైన లీలలను గుర్తించలేక నీ గుడికి తలుపులు పెట్టించాలని తలంచాను!

ఈ ప్రాంతాల ప్రజలకేకాక జగత్తునకంతా రక్షకురాలైన నీ శక్తిని గుర్తించలేక మూఢుడనై నీకు రక్షణ కల్పించే ప్రయత్నం చేశాను! జననీ క్షమించు' అంటూ అనేకవిధాల అమ్మణ్ణిని ప్రార్థించి, గుడికి తలుపులుపెట్టే ప్రయత్నం విరమించుకొన్నారు....

అందువల్లనే అనన్య మహిమోపేతయైన దేవి శ్రీ చెంగాళమ్మ గర్భగుడికి నేటికికూడా తలుపులులేవు! ఎప్పుడూ రాత్రింబవళ్ళు నిర్విరామంగా జగదీశ్వరీ దర్శనభాగ్యం సర్వజనావళికి లభిస్తోంది!

ఈ ఉదంతానికి నిదర్శనగా దేవీ ఆలయ ఆవరణలో గర్భాలయానికి ఈశాన్యదిశలో ఇప్పటికికూడావున్న ఆనాటి పెనువృక్షం మొదలుకు పెనవేసుకొని కలసిపోయినట్లున్న తలుపు చెక్కల ఆకారం ప్రత్యేకంగా పలకలు, పలకలుగా వున్న చెట్టును నేటికీ భక్తులు తిలకిస్తున్నారు.

ఈ వృక్షాన్ని భక్తులు 'చెంగాళమ్మచెట్టు' అని వ్యవహరిస్తూ, దేవిని దర్శించిన ప్రతివారూ యీ చెట్టుకు భక్తితో ప్రదక్షిణలు చేస్తుంటారు.

ఎప్పటికప్పుడు రోజురోజుకు శ్రీ చెంగాళమ్మ మహిమలు ప్రబలం కావడంతో దేవీప్రభావం బహుళ ప్రచారమై ఈ ప్రాంతమంతా వ్యాపించి, భక్తుల రాక ఎక్కువైంది.

గ్రామంలోని రైతులందరు గ్రామ పెద్దగావున్న అరవ భూమి చంద్రారెడ్డి (ఇటీవల మరణించిన రామచంద్రారెడ్డిగారి ముత్తాత) ఆధ్వర్యంలో గ్రామంలో దేవియందు భక్తిప్రపత్తులు కలిగిన ఒక కుటుంబంవారిని గుడి పూజార్లుగాను, మరో కుటుంబాన్ని కావలిదార్లుగాను, మరికొందరిని పనిబాపలవారుగా నిర్ణయించి శ్రీ చెంగాళమ్మ ఆలయంలో నిత్యపూజలు దేవికి అభిషేక, ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిగే ఏర్పాట్లు చేశారు. అనంతరం బ్రహ్మోత్సవములను ప్రత్యేక పద్దతుల్లో వారం రోజులపాటు వైభవంగా జరుపుతున్నట్లు ఆధారాలున్నాయి!

సుళ్ళువుత్సవ ప్రత్యేకత!

శ్రీ చెంగాళమ్మ బ్రహ్మోత్సవములలో మూడు రోజులు సాయంకాలం జరిగే "సుళ్ళుఉత్సవం" ప్రత్యేక పద్ధతుల్లో జనాకర్షణీయంగా జరుగుతుంది.

ఈ మహాశక్తికి ఎదురుగా ఆలయ ఆవరణలో నలభై అడుగుల ఎత్తుగల లావుపాటి స్థంభాన్ని ప్రతిష్ఠిస్తారు. ఈ స్థంభానికి అగ్రభాగంలో నలువైపులా తిరిగేలా రాట్నం అమర్చి ఆ రాట్నంమీద అడ్డంగా ఏభై అడుగుల

పొడవున్న మరో కొయ్యను త్రాసులా ఇరువైపులా సరిసమానంగా వుండేటట్లు అమర్చి దానికి ఒకవైపు పాలవెల్లిలా చట్రాన్ని బిగిస్తారు. యీ పొడవాటి కొయ్యను మరోవైపు దిగువకుదించి నలువైపులా తిరిగేలా ఏర్పరుస్తారు. దీనిని 'సుడిమాను' అని అంటారు. బ్రహ్మోత్సవ వేడుకలలో ప్రధానమైన యీ 'సుడిమాను' వుత్సవాన్ని తిలకించేందుకు వేలాదిమంది ప్రజలు పాల్గొంటారు.

'సుడిమాను'కు ఒకవైపున్న చట్రానికి జీవంతోవున్న నల్లని మేక పిల్లను, పసుపు బట్టలలోవున్న ఒడిబాల, రోలు, నిలువెత్తు మనిషి బొమ్మ, పూలమాలను కట్టి ఒక్కోమారు తొమ్మిది ప్రదక్షిణలుగా సుడిమానును తప్పెట్లు. తాషాలు. పంబజోళ్ళతో గొల్లలు వీరతాళ్ళువేసుకొంటూ, కిలారింపులతో, మాతల చిందులతో ఎంతో ఆర్భాటంగా సుళ్ళువుత్సవం జరుగుతుంది.

జీవంతోవున్న మేకపిల్లను సుడిమానుకు కట్టి పైకిలేపి త్రిప్పే సమయంలో డప్పుల శబ్దంతో....కిలారింపుల, కేకల భీభత్సంతో భీతిచెందిన మేకపిల్ల పైకి వెళ్ళేకొద్దీ దిగువవున్న జనసందోహాన్నిచూసి ప్రాణభయంతో 'మే! మే!' అంటూ అరచే దృశ్యాన్ని అశేష జనసందోహము వింత అనుభూతితో, ఎంతో ఆసక్తితో తిలకిస్తారు.

పూర్వం సుడిమానుకు మనిషిని కట్టి త్రిప్పేవారనియు, అయితే మారిన కాలంతోబాటు కొన్ని కొన్ని పద్దతుల్లోకూడా మార్పు చేర్పులు చేసి ఇప్పుడు కొంతకాలంనుండి మనిషికి మారుగా బొమ్మను కట్టి త్రిప్పుతున్నారు.

మొత్తంమీద ఇక్కడ జరిగే రీతిలో రాష్ట్రంలో మరెక్కడా సుళ్ళు ఉత్సవం జరుగుతున్నట్లు దాఖలాలు కనుపించడంలేదు.

కానీ, కొన్ని పురాణాలలో 'సుడిమాను'ను 'సిడి' వుత్సవం అని పేర్కొనివున్నది. ప్రధానంగా తెనాలి రామకృష్ణ కవి 'పాండురంగ మహాత్మ్యము'లో ఈ 'సిడి'మాను ప్రస్తాపన వున్నది.

నదీ సుడిగుండాలలో లభించిన యీ దేవికి సుళ్ళువుత్సవం జరుపుతున్నారని జనవాక్యం!

ప్రత్యేక పద్ధతుల్లో సుళ్ళు ఉత్సవం జరగడంవల్ల ఈ గ్రామానికి 'సుళ్ళూరు' అనే పేరు ఏర్పడింది. తర్వాత ప్రక్కనే విస్తరించిన వ్యాపార కూడలిని 'పేట' అని వ్యవహరిస్తూ, కాలక్రమేణా రెండు ప్రాంతాలు కలిసి సూళ్ళూరుపేటగా మార్పుచెంది స్థిరపడింది.

ఈ కారణాలవల్ల శుభకరిపురమనే పేరు మరుగునపడిపోయి, నేడు సుళ్ళూరు మరియు సూళ్ళూరుపేటలుగా ప్రశస్థిలోకి వచ్చింది.

సంతానహీనులకు వరప్రసాదిని!

పూర్వం సంతానహీనులైనవారు సంతానాభిలాషతో అనేక పుణ్యక్షేత్రములను సందర్శించి, ఎందరో దేవతలకు మ్రొక్కుకొని, అనేక నియమాలతో దీక్ష సాగించి, వరసిద్ధిపొంది సంతానవంతులయ్యేవారు కొందరు!

ఆనాడు సంతానహీనులయిన స్త్రీలను సభ్యసమాజంతోబాటు సాటి స్త్రీలు సైతం 'గొడ్రాళ్ళు' అంటూ చులకనచేసి హీనంగా చూసేవారు.

బిడ్డలుకలుగలేదనే నెపంతో భార్య జీవించివుండగానే, మరో స్త్రీని వివాహం మీద వివాహాలు చేసుకొనే ప్రబుద్ధులైన పురుషులెందరో కూడా వుండేరోజులవి!

ఆ రోజులలో సంతానహీనులయిన స్త్రీలు భక్తితో శ్రీ చెంగాళమ్మను సేవించి, వరప్రసాదితులై సంతానప్రాప్తి కలిగినవారెందరోవున్నారు.

సంతానాభిలాషులైన స్త్రీలు అత్యంత నియమనిష్ఠలతో, సూర్యోదయంతోనే శ్రీ చెంగాళమ్మ సన్నిధికి వచ్చి సమీపంలోని కాళంగి నదిలో శుచిగా తలస్నానం చేసి, పసుపుచీర ధరించి, తడిబట్టలతో, నొసట కుంకుమ దిద్ది, పసుపు కుంకుమలతో, పళ్ళు, పూలు, కొబ్బరికాయలు మున్నగు పూజా ద్రవ్యాలతో, దేవీ గర్భాలయానికి ప్రదక్షిణలుసల్పి, దేవీ ముంగిట ఒడిబాలతో ఆ తల్లి విగ్రహమూర్తికి ఎదురుగా సాష్టాంగప్రణామములతో, వరసిద్ధికొరకు కఠోరదీక్షగా కొన్నివారాలపాటు వరప్రదానం లభించేవరకు దీక్ష కొనసాగించేవారు.

ఆ సమయములోనే ఆలయ ఆవరణలోని చెంగాళమ్మ చెట్టుకు కూడా ప్రదక్షిణలుచేసి చెట్టుకొమ్మలకు ఉయ్యాలలు కట్టుంటారు. అలా చిత్తశుద్ధితో దృఢలక్ష్యంతో, పవిత్రమైన భక్తిభావంతో, నియమనిబంధనలతో సంతానసిద్ధి కోసరం పరపడే వనితలకు దేవి స్వప్నసాక్షాత్కారం లభించి, కోరుకొన్న వరాలను ప్రసాదించేదని ప్రతీతి. జగన్మాత వరప్రభావంతో తప్పక సంతానవతులవుతారనే ప్రగాఢ విశ్వాసం ప్రజల్లో ప్రబలంగా ఏర్పడివుంది.

ఇలా సంతానాభిలాషతో నేడుకూడా ఎందరో స్త్రీలు దేవీ ఆలయంలో వరపడే దృశ్యం ప్రతి శుక్ర, ఆది, మంగళవారాలలో తిలకించవచ్చును.

శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీ వరప్రభావంతో జన్మించిన తమ బిడ్డలకు చెంగమ్మ, చెంగయ్య, చెంగలయ్య, చెంగాళమ్మ, సూళూరమ్మ అనే పేర్లు పెట్టుకొనేవారు. అందువల్లనే యీ ప్రాంతాలలో చెంగాళి అనే పేర్లుగల వారు అనేకమంది వుండడమే దీనికి తార్కాణం.

ఈ దృష్టాంతరములననుసరించి.... ఈ ప్రాంతాలలో వాడుకలోవున్న వ్యక్తుల పేర్లూ ఈనాటికీ శ్రీ చెంగాళమ్మ గుడిలో జరిగే సంతానాభిలాషులైన యువతులు మనోనిబ్బరంతో వరపడే దృశ్యము యీ సంఘటనకు సాక్షీభూతం.

ఇంకా చిత్తూరు జిల్లాలో కొన్నిప్రాంతాలలోకూడా యిలాంటి పేర్లు కొన్ని ప్రబలంగా వినిపిస్తూంటాయి.... తిరుపతి సమీపంలోని కొన్ని పల్లె ప్రాంతాలలో ఉత్సాహంగా ఆడుతూ పాడుతూ, చొరవగా ఎప్పుడూ నిండుకుండలా గలగలలాడుతూ, బిడియం లేకుండా మాట్లాడే యువతులను వయసు ముదిరిన వనితలు కొందరు 'ఒసే! నువ్ సూలూరి చెంగాలిగా వుండావిగదే!' అంటూ ఎద్దేవా చేస్తుంటారని చిత్తూరు జిల్లా ప్రముఖ రచయిత ఒకరు వెల్లడించారు.

పరమేశ్వరీరక్ష - పసిబిడ్డలకు పరమౌషధము!

బాలగ్రహ దోషాలతో, చిడితో బాధలు పడుతున్న పసిబిడ్డలను ఈ చల్లని తల్లి చెంతకు తీసుకొనివచ్చి అమ్మవారి రక్ష కట్టిస్తారు. దీనిని 'చీటిఆకు' అని వ్యవహరిస్తారు.

లేత తాళపత్రంమీద బీజాక్షరాలువేసి, దేవీ పాదాలచెంతవుంచి. పసుపు కుంకుమలతో పూజలుచేసి, ఆ పత్రాన్ని మడతలువేసి, పసుపుదారం చుట్టి, చిన్న రక్షాబంధంగా పూజార్లు బాలగ్రహదోషాల నివారణకు బిడ్డలకు కడ్తారు.

ఈ తల్లి అనుగ్రహంతో చీటాకు కట్టిన బిడ్డలకు బాలారిష్టాలు తొలగిపోతాయని ప్రతీతి.

ఈనాటివరకు కూడా యీ దేవీ రక్షాబంధమే యీ ప్రాంతాలలో పసిపిల్లలపాలిట పరమౌషధంగా భావిస్తుంటారు.

ఆ రోజులలో యీ ప్రాంతాలలో మశూచి, కలరా, స్ఫోటకములాంటి అంటువ్యాధులు ప్రబలినప్పుడు, ప్రజలు భయభ్రాంతితో తల్లడిల్లిపోయేవారు. అలాంటి సమయాలలో గ్రామపెద్దలు వీధులలో వేపఆకు తోరణములు కట్టి, పోలేరమ్మ, అంకమ్మ గ్రామశక్తులకు అంబళ్ళుపోసి, సాయంకాలం మేళతాళాలతో, డప్పులు, పంబజోళ్ళతో ప్రజలతో కలసి శ్రీ చెంగాళమ్మ గుడికి వెళ్ళి ఆ తల్లిని ప్రార్థించేవారు.

ఆ రోజులలో దేవి గణాచారి (చాకలి) మీదకు పూనకం వచ్చి తన్నివారణోపాయాలను సూచించి....ప్రజలను భయపడవద్దని ధైర్యవచనాలు పలికేదట. ఆ రోజులలో ప్రజలు భీతితో పొద్దుపోతే వీధులలో సంచరించేవారుకారు. నిర్మానుష్యంగావున్న పురవీధులలో అర్ధరాత్రి సమయంలో, తెల్లని చీర ధరించిన ఒక స్త్రీ సంచరించేదనీ, అలాగే ఒక్కోమారు పన్నెండేళ్ళ బాలగా శ్రీ చెంగాళమ్మతల్లి బాలాత్రిపురసుందరిగా వీధులలో సంచరించేదనీ, జనవాక్యం....

దేవీ సంచార ప్రభావంతో ప్రజల అరిష్టాలు తొలగిపోయేవనీ, గ్రామాన్ని పరిరక్షిస్తూ దక్షిణ పొలిమేర్లలో ఆదిశక్తిగా అవతరించివున్న శ్రీ చెంగాళమ్మ ప్రభావాలను అనాడు ప్రజలు పలువిధాలుగా ప్రస్తుతిస్తూ ఆరాధించేవారు.

కర్షకులపాలిట కల్పతరువు! దేవీ ప్రసాదము!

ఈ ప్రాంతాలలో రైతులు తమ పొలాలలో పంటలకు చీడ, పీడలు సంభవించినప్పుడు భక్తితో శ్రీ చెంగాళమ్మ ఆలయానికి అత్యంత నిష్టతో వచ్చి, దేవికి అర్చనచేసిన ప్రసాదం (పసుపు, కుంకుమ) తీసుకొనిపోయి, ఇసుక, బూడిదలతో మిళితంచేసి మాగాణి భూములలో పంటలమీద చల్లుతారు.

పవిత్రమైన దేవీ ప్రసాదం తీసుకొనివెళ్ళే రైతులు సూర్యోదయంతో వచ్చి, సమీపంలోని నదిలో శుచిగా స్నానంచేసి, దేవీ ఆలయానికి తొమ్మిది ప్రదక్షిణలు చేసి, భక్తితో అర్చనలు చేసి, పూజార్లనుండి స్వీకరించిన మహాప్రసాదాన్ని పసుపు బట్టల్లో భద్రపరచుకొని, పవిత్రమైన బగవతీ స్మరణతో సరాసరి తమ గ్రామాలకు వెళ్తుంటారు.

పవిత్రంగా దేవీ ప్రసాదాన్ని తీసుకొనివెళ్ళే సమయంలో.... తమకెదురైన వారెవ్వరితోనూ సంభాషించకుండా, ఏకధ్యాసతో, మనోనిగ్రహంతో మౌనవ్రతం పాటించి వెళ్ళి, తమ పంటలమీద ఇసుకలో కలిపి సమపాళ్ళలో చల్లేవారు. యీ ప్రసాదాన్ని దేవీ బండారం అంటారు.

వీరి నిశ్చల భక్తి, ప్రగాఢ నమ్మకము వమ్ముకాకుండా దేవీ అనుగ్రహంతో పంటల మీద సోకిన చీడ, పీడలు మటుమాయమై, పంటలు పచ్చగా కలకలలాడుతూ సత్ఫలితాలిస్తాయని అనేకమంది రైతులు నమ్మకం. ఈనాడుకూడా యీ ప్రాంతాలలో రైతులు కొందరు యీ ఆచారాన్ని పాటిస్తూ శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవిపట్ల తమ భక్తి విశ్వాసాలను ప్రకటిస్తున్నారు.

నిమ్మపండు అభయం!

కోరినవారికి కొంగుబంగారం శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవి అని అనేకమంది భక్తజనుల నమ్మకం. భక్తుల నమ్మకానికి నిదర్శనగా కొందరు తమమనసులలో ఎన్నోకోర్కెలతో గుడికివచ్చి, ఫలపుష్పాలు, కొబ్బరికాయల తోబాటు మంచి నిమ్మపండునుకూడా తెచ్చి పూజార్లకుయిచ్చి, తమ గోత్ర నామాదులతో కుంకుమార్చన చేయిస్తారు. ఆసమయంలో వీరు మనసులో తమ కోరికను తలంచుకొని, నిమ్మపండును భక్తిపూర్వకంగా చేతితో స్పృశించి, పూజారికి అందజేసి, తల్లి చేతిలో వుంచమని కోరుతారు.

వీరి కోరికమేరకు నిమ్మపండును దేవి దక్షిణ అభయహస్తం మీద వుంచి పూజారి కుంకుమార్చన చేసి, గంట మ్రోగిస్తూ కర్పూర నీరాజనం యిస్తాడు. ఆ సమయంలో అర్చన చేయించిన భక్తుని మనసులో కోరిక వెరవేరుతుందనేందుకు నిదర్శనంగా దేవి చేతిలోని నిమ్మపండు విసిరివేసినట్లు ఎగిరి భక్తునిముందు పడుతుంది. ఆ సూచనతో తాము మదిలో తలంచిన కార్యం శుభప్రదమవుతుందనీ, దేవీ అభయం లభించినదనే సంతృప్తి అనేక మంది భక్తులలో ఏర్పడివుంది.

ఒక్కోమారుమాత్రం భక్తుల కోరికలకు ఆటంకాలు కలిగేయడల.... ఎంతోసమయం ఆశతో ఎదురుచూస్తూ, ఏకాగ్రతతో గంటలతరబడి నిలబడినా కొందరికి అమ్మ చేతిలోని నిమ్మపండు చెక్కుచెదరకుండా, ఏమాత్రం కదలిక లేకుండా నిశ్చలంగా వుండిపోతుందేకానీ క్రింద పడదు. అలాంటి భక్తులు తమకు తల్లి అనుమతి లభించలేదనీ తమకోర్కెలు కొంతకాలం ఫల ప్రదంకావని భావిస్తారు.... అలాంటి వారు పట్టు విడవకుండా ఎన్నిసూర్లు వచ్చి అర్చించినా....అభయప్రదానం జరగదు.

కొందరు భక్తుల కోర్కెలకు నిమ్మపండు అమ్మవారి చేతినుండి పూజారి అర్చన ప్రారంభించగానే ఎగిరివచ్చి పడుతుంది. అలాంటి సమయా లలో భక్తులు సంతృప్తితో పొందే ఆనందానుభూతులు వర్ణనాతీతం!

యీ అభయప్రధానం కొరకు.... యిప్పటికీ అనేకమంది భక్తులు వచ్చి, ఏకాగ్రతతో దేవిని పూజించి.... తల్లి అనుగ్రహంతో నిమ్మపండు యిచ్చిందనే సంతృప్తి....సంతోషాలతో, తమ కోరికలు శుభప్రదంగా నెరవేరుతాయనే ఆశతో వెళ్ళి తాము తలచిన కార్యాలను ప్రారంభిస్తారు. అలాంటివారి కోరికలు జయప్రదంగా నెరవేరుతున్నాయనే భావం అనేకమంది భక్తులలో నేటికీ వుంది!

అందువల్లనే శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవిని, వరాల కల్పవల్లి, చల్లనితల్లి, కృపాసాగరి, లోకబాంధవి, జగత్కల్యాణి, జగజ్జననీ, ఈశ్వరీ, పరమేశ్వరీ అంటూ బహువిధాల స్తుతిస్తూ, ప్రార్థనలు చేస్తూ, తమ మొక్కుబడులు తీర్చుకొంటూ తల్లికి విశేషంగా కానుకలు సమర్పిస్తూంటారు భక్తులు.

ఇక్కడ శ్రీ చెంగాళమ్మ అవతారంలో ఆదిశక్తిగా, పరమేశ్వరిగా అవతరించివున్న దేవీ విగ్రహానికి గర్భగుడి నిర్మాణానంతరం యీ గ్రామం లోని అరవభూమి చంద్రారెడ్డి అనే రైతు ఆధ్వర్యంలో శ్రీ చెంగాళమ్మ దేవతకు మొట్టమొదటగా బ్రిహ్మోత్సవములు ప్రారంభమైనట్లు తెలుస్తోంది, ఆయన మరణానంతరం, ఆయన కుమారుడు కృష్ణారెడ్డి గుడి ఆధిపత్యం వహించారనీ! వీరికాలంలో గుడి అభివృద్ధి కార్యాలుగానీ, బ్రహ్మోత్సవాలుగానీ జరిగినట్లు దాఖలాలు కనుపించలేదు. తర్వాత కృష్ణారెడ్డిగారి కుమారుడు వెంకురెడ్డిగారు ప్రయోజకులై, దేవీ అపారశక్తిని గుర్తించి, ప్రగాఢమైన

భక్తి విశ్వాసాలతో అమ్మణ్ణిని సేవిస్తూ, ఆలయాభివృద్ధికి నిరంతరం నిర్విరామంగా కృషిచేస్తూ చెంగాళమ్మ తిరునాళ్ళు అంటే ఆ రోజులలో జిల్లాలోనేగాక మదరాసు ప్రాంతంలోకూడా విశిష్టత చేకూర్చారని ప్రతీతి.

వీరి ఆధిపత్యంలో దేవీ వుత్సవములకు అశ్వ, సింహ, నంది వాహనములను, మహిషాసురుని భయంకర విగ్రహాన్ని చేయించారని, సుడిమానును ఇత్తడి తొడుగులతో తళతళలాడేలా ఆకర్షణీయంగా రూపొందించినట్లు, ఆరోజులలో 'మహిషాసురవధ' వేడుకలను తిలకించేందుకు చుట్టుప్రక్కల ఎంతో దూరబార గ్రామాలనుండి మూటకూళ్ళు కట్టుకొని వేలాదిమంది ప్రజలు వచ్చేవారనీ....వీరిలో అనేకమంది మహిషాసురసంహార సమయంలో సింహవాహనారూఢయైన దేవీ అలంకారమున్న బండిమీద పెద్ద తలపాగా ధరించి, ధోవతి, కోటుతో కత్తి చేతబట్టి మహిషాసురుణ్ణి సంహరించే ఘట్టంలో ధర్మకర్త వెంకురెడ్డిగారిని చూడాలనే తలంపుతో వచ్చేవారు.

ఆరోజుల్లో వెంకురెడ్డిగారిని చెంగాళమ్మరెడ్డి అని వ్యవహరించేవారట! వీరికి శ్రీ చెంగాళమ్మ ప్రత్యక్షంగా కనుపించి సంభాషించేదని యీ ప్రాంతంలోని ప్రజల నమ్మకం.

శ్రీ వెంకురెడ్డి శపథం! - అమ్మ అనుగ్రహం!

ఒకమారు గ్రామంలో కలరావ్యాధి తీవ్రంగా ప్రబలి అనేకమంది ప్రాణాలు హరించినదనీ .... ఆ సమయంలో ప్రజలు భయంతో గ్రామ ప్రాంతాలను వదలిపెట్టి పారిపోయేందుకు ప్రయత్నాలు ప్రారంభించారట.... గ్రామపెద్దలు, ప్రజలు కలసి వెంకురెడ్డిగారితో చర్చించి, ఆ సాయంత్రం గుడికివెళ్ళి చెంగాళమ్మను వేడుకున్నారనీ, గణాచారిమీదకు ఆవాహనఅయి

తన్నివారణోపాయం చెప్పమని దేవిని పలువిధాల ప్రార్థించినప్పటికీ, గణాచారిమీద పూనకం రాకపోవడంతో ప్రజలందరూ నిరాశానిస్పృహలతో, దేవికి ఎందుకో ఆగ్రహం వచ్చిందని, యిక గ్రామానికి అరిష్టం తప్పదని భయంతో గడగడలాడిపోయారట.

ప్రజల్లో ఏర్పడిన భయాందోళనలను గుర్తించిన వెంకురెడ్డి క్రోధంతో మహిషాసురునిలా విజృంభించి, తల్లి విగ్రహం ఎదుట నిలబడి, నిశ్చలంగా ఏకాగ్రతతో ప్రార్థించి, అనంతరం గట్టిగా 'తల్లీ! నీవు లోకరక్షకివనీ, జగన్మాతవనీ, సత్యంగల దేవతవని నమ్మి నిన్నే స్మరిస్తూ పూజలుచేస్తున్న యీ గ్రామ ప్రజలకు ఎందుకీ అరిష్టం వచ్చింది? యీ బాధలనుండి నీబిడ్డలను రక్షించు! లేదా! నీవు రక్షకివికాదు, మా పాలిట భక్షకివి!' అంటూ కోపంతో వూగిపోతూ....తెల్లవారేసరికి గ్రామంలో ప్రవేశించివున్న కలరా మహమ్మారిని పారద్రోలి, ప్రజలను కాపాడి భయవిముక్తుల్ని చేయి! లేకపోతే రేపీపాటికి నీవు యిక్కడుండవు. నీ విగ్రహాన్ని పెకలించి, నదిలో కలిపివేసి నేనూ ఆత్మాహుతి చేసుకొంటానని శపథం చేశాడనీ....

ఆ రాత్రి భయంతో గ్రామవీధులన్నీ నిర్మానుష్యంగా, నిశ్శబ్ద వాతావరణంలో మునిగివున్నసమయంలో, ఒక స్త్రీమూర్తి గ్రామసంచారం చేసి, నిద్రలేకుండా ఆలోచనాసముద్రతరంగాలలో మునిగిపోయి, విషాద వదనంతోవున్న వెంకురెడ్డి దగ్గరకు వచ్చి ఆ స్త్రీమూర్తి రెడ్డి భుజంతట్టి, భయపడవద్దని హెచ్చరించి అదృశ్యమైనదనీ....

తెల్లవారేసరికి వూరిలో వ్యాధి తగ్గుముఖంపట్టినట్లు.... గ్రామంలోని ముఖ్యమైన వీధిగెమళ్ళలో కొన్నిప్రాంతాలలో ఎర్రని గాజు ముక్కలు పగిలిపోయి పడియున్నాయని, వాటితోబాటు అక్కడక్కడ పసుపు కుంకుమలు

పడివున్న గుర్తులున్నట్లు....ఆరాత్రి భయంతో తలుపులు బంధించి యిళ్ళలో వున్నవారిలో కొందరికి వీధిలో గల్లు గల్లు మనే కాలి అందెల సవ్వడి వినిపించినదని, అవి దేవీ సంచార చిహ్నాలుగా భావించారు.

వెంకురెడ్డిగారి శపథముతో మరుదినంనుండి గ్రామంలో ఎలాంటి అరిష్టాలు సంభవించలేదని కొందరు వయోవృద్ధులనుండి తెలిసింది.

పంచలోహ విగ్రహాల ఉదంతం!

ఆకాలంలో బ్రహ్మోత్సవములలో అంకమ్మ, చెంగాళమ్మ కొయ్య విగ్రహాలను అలంకరించి గ్రామోత్సవాలు చేసేవారు. కొయ్యవిగ్రహాలు చెదలుపట్టి, రంగులు వెలసిపోతుండేవి. పంచలోహములతో వుత్సవ విగ్రహాలను చేయించాలని సంకల్పించారు.

ఆరోజులలో అక్కంపేటలోని బేరిశెట్ల కుటుంబాలకు మద్రాసులో దగ్గర బంధువులుండేవారు. వీరందరూ దేవీభక్తులు. ప్రతి వారము మదరాసు నుండి కుటుంబాలతోవచ్చి దేవికి పొంగళ్ళు పెట్టుకొని, మొక్కుబడులు తీర్చుకొని వెళ్ళేవారు.

వెంకురెడ్డిగారు మదరాసులో బేరిశెట్టి కుటుంబాలను కలుసుకొని, వారిద్వారా విరాళాలు సేకరించి, విగ్రహాల నిర్మాణానికి సహాయమర్థించాలని భావించి, గుడి ప్రధాన పూజారితో కలసి వెళ్ళి మదరాసులో నివశిస్తున్న ధనికులు, దేవీ భక్తులు, తమకు పరిచయమున్న ఒక పెద్ద వ్యాపారిఅయిన శెట్టిగారింటికి మొట్టమొదటగావెళ్ళి తాము వచ్చిన దేవీకార్యం వివరించారట, ఆ శెట్టి వీరిని ఎంతో ఆదరాభిమానాలతో గౌరవించి, తనవంతు విరాళముగా

అయిదు రూపాయ బిళ్ళలను తాంబూలంలోపెట్టి యిచ్చారట, దానితో ఖిన్నులైన రెడ్డి ప్రథమ విరాళం అయిదు రూపాయల స్వల్పమొత్తంతో ప్రారంభమయితే యిక యీ బృహత్తర కార్యం నెరవేరుతుందా? అని భావించి, శెట్టి మనసును నొప్పించడం ఇష్టంలేక తాంబూలంమాత్రం స్వీకరించి, విరాళాన్ని ఆయనకేయిచ్చి ప్రస్తుతం డబ్బు మీ దగ్గరే వుంచండి! అవసర సమయంలో వచ్చి తీసుకుంటామనిచెప్పి, నిరుత్సాహంతో వేరెవ్వరినీ కలుసుకోకనే తిరిగి వూరికి వచ్చేశారట.

ఆరోజు రాత్రి?

మదరాసు నగరంలో తమ ఇంట్లో ఆదమర్చి నిద్రపోతున్న బేరిశెట్టిని ఆయన మేనత్త రూపంలో ఒక ముత్తయిదు వచ్చి తట్టి నిద్ర లేపి....'ఏమిరా! నాయనా! నీకున్న సంపదలో మునిగిపోయి నన్ను మరిచి పోతున్నావే! ఈ ముసలిదానికి నీకున్నదాంట్లో కొంతయిస్తే నీ సంపద తరిగిపోతుందనుకున్నావా? మనిషికి మరీ అంత లోభత్వం పనికిరాదురా!' అని హెచ్చరించడంతో కలవరపడి నిద్రమేల్కొన్న శెట్టి కళ్ళు నులుము కొని, నలువైపులా పరికించి, అక్కడెవ్వరూ లేకపోవడంతో, ఏమిటి మాయ కలా! లేక భ్రమా! అనే సందేహంతో, గాఢనిద్రలో మునిగివున్న భార్యను నిద్రలేపి జరిగిన విషయం చెప్పగా....ఆమె ఆరోజు మధ్యాహ్నం జరిగిన సంఘటనను భర్తకు గుర్తుచేసి....ఇది సూళూరు చెంగాళమ్మతల్లి మహిమేననీ కలలో మేనత్త రూపంలో కనుపించినది ఆ చెంగాళమ్మతల్లేనని, దంపతులిద్దరూ భక్తితో చెంపలేసుకొని, తెల్లవారగానే బయలుదేరి ఇక్కడకొచ్చి అమ్మవారిని దర్శించి, తెలియకచేసిన తప్పులను మన్నించమని ప్రార్థించి, భక్తితో గుంజిళ్ళుపెట్టి, గుడి ప్రదక్షిణలుచేసి.... తర్వాత పూజారితోకలసి వెంకురెడ్డి

గారిని కలుసుకొని, రాత్రి తనకు జరిగిన స్వప్నానుభూతిని వివరించి, దేవీ విగ్రహముల తయారీకి అయ్యే ఖర్చు యెంతైనా పూర్తిగా తానే భరిస్తానని ప్రాధేయపడి....వాగ్దానంచేసి, ఆ మేరకు శ్రీ చెంగాళమ్మ, అంకమ్మ పంచ లోహ విగ్రహాలను చేయించి సమర్పించారట.

ఈ భక్తుని పేరు నాగలాపురం గోవిందుశెట్టి. ఇప్పటికీ బ్రహ్మో త్సవాలలో ఆయన సమర్పించిన వుత్సవ విగ్రహమూర్తులనే అలంకరించి వూరేగింపు జరుపుతున్నారు.

మహత్తరమైన ఈ విగ్రహాల ఉదంతము అనంతరము దేవీ మహిమలు మదరాసు నగరంలో విస్తృత ప్రచారమైనందున ఆ ప్రాంతాల నుండి....ప్రతివారము భక్తులు కుటుంబాలతో, దేవీ సందర్శనార్థం తీర్థప్రజల్లా బండ్లుమీద వచ్చేవారు.

శుక్ర, ఆది వారాలు భక్తుల సందడితో ఆలయప్రాంతమంతా కలకల లాడుతుండేది. పొంగళ్ళు పెట్టుకొని, జోడు పొట్టేళ్ళతో మొక్కులు తీర్చుకొనే వారూ, తల్లికి భక్తితో చీరలు సమర్పించి హుండీలో కానుకలు వేసేవారూ, వారివారి తాహతులననుసరించి ఉడతాభక్తిగా తమవంతుల కానుకలను సమర్పించేవారూ, ఇలా ధనిక పేద తారతమ్యాలు లేకుండా ప్రజలు విశేష సంఖ్యలో వచ్చి, చెంగాళమ్మదేవతను పూజించి మొక్కులు తీర్చుకొనేవారు. ఆ తల్లి వరప్రసాదంగా జన్మించిన తమ బిడ్డలకు భక్తితో పుట్టువెంట్రుకలు సమర్పించేవారు.

భక్తజనులకు ప్రత్యక్షదైవంగా వెలుగొందుతున్న శ్రీ చెంగాళమ్మ తల్లికి ఎన్. పార్థసారధిశెట్టి అనే వ్యక్తి మదరాసు అమ్మన్‌కోవిల్‌వీధిలో, 32 నంబరుగల ఒక భవనాన్ని విరాళప్రదానంగా సమర్పించినట్లు దాఖలాలు కనబడుతున్నాయి.

మలయాళమాంత్రికుని భంగం!

రోజురోజుకూ శ్రీ చెంగాళమ్మ తల్లి మహత్మ్యం బహుళప్రచార మవడంతో కేరళ రాష్ట్రంలో క్షుద్రశక్తులనుపాసించి భూతవైద్యునిగా, గొప్ప మాంత్రికునివలె చలామణిఅవుతున్న ఒక వ్యక్తి దృష్టి శ్రీ చెంగాళమ్మతల్లి మీద పడింది.

ఆ మాంత్రికుడు నిగూఢంగా, దేవీభక్తునిలావచ్చి ఆలయ పరిసరాలలో సంచరిస్తూ ప్రతిరోజు అమ్మణ్ణిని పూజిస్తూ, అభిషేకసమయాలలో దేవీ మూర్తిని నిశితంగా పరిశీలించేవాడట.... ఈ మాంత్రికుడు దేవీ అపూర్వ శక్తులను తన మంత్రశక్తితో వశపరచుకోవాలనే దుష్టతలంపుతో ప్రయత్నాలు ప్రారంభించి, నలభై రోజులు యీ శక్తి గుడికి కొంతదూరంలోని నదిలో స్నానపానాదులుచేసి, అత్యంత నియమనిష్టలతో ప్రతిరోజూ నియమం తప్పకుండా తన మంత్రశక్తితో క్షుద్రదేవతలను ఆవహించి, పూజించి, పట్టుదలతో శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీ అనంతమహితాశక్తులను బంధించి వశపర్చుకొనేందుకు తీవ్రంగా పూజలుచేశాడు.

ఆరోజు ఆదివారం, అమావాశ్య. సంపూర్ణ సూర్యగ్రహణం. ఆ శుభసమయంకోసరమే కాచుకొనివున్న మాంత్రికుడు సూర్యోదయా త్పూర్వం కాళంగినదిలో స్నానంచేసి, ఆవలిగట్టుమీద నిర్మానుష్యంగావున్న ఒక చెట్టుక్రింద నిష్ఠతో మంత్రోపాసనాదీక్షను నాటిరాత్రివరకు కొనసాగించాడు. నలభై రోజులు చేసిన తన కృషికి ఈరోజు ఫలితం లభిస్తుందనే ఆశతో మాంత్రికుడు అర్ధరాత్రి, భయంకరమైన వేళలో, సమీపంలోని శ్మశానంలో క్షుద్రదేవతలను ఆరాధించి, నగ్నదేహంతో నదిలో స్నానంచేసి తల విరబోసుకొని, నొసట విభూదిరేఖలు కుంకుమ దిద్దుకొని, ప్రళయకాల భైరవునిలా, గంభీరరూపంతో దేవీ ఆలయప్రాంగణంలో ప్రవేశించాడు.

పరిసరప్రాంతాలలో నక్కల కూతలు వికృతంగా వినబడుతున్నాయి. ఆ భయంకర నిశ్శబ్ధ నిశీధిలో మాంత్రికుడు దేవీమ్రోల సాష్టాంగప్రణామము లాచరించి....గర్భగుడి ఎదురుగా రంగులతో ముగ్గులువేసి, పసుపు కుంకుమలు విరజల్లి, నిమ్మకాయలుకోసి నలువైపులావుంచి, దేవీశక్తిని వశపర్చుకొనేందుకు క్షుద్ర మంత్రాలతో ఉపాసనపూజ ప్రారంభించాడు.

ఒక జాము గడిచింది. దేవి ప్రత్యక్షమై తనవశం కాలేదనే క్రోధంతో మాంత్రికుడు ఆగ్రహోదగ్రుడై భీకరస్వరంతో మంత్రోచ్చారణ చేస్తున్నాడు. గర్భాలయంలో జ్యోతి వెలుగు కాంతిలో దేవీరూపం చిరునవ్వులు చిందిస్తూ వుంది.

ఒక్కమారు పెనుతుఫానువీచి పెద్దపెట్టున భయంకరంగా పిడుగులు వర్షించినట్లు భీకరశబ్ధం వినబడింది. ఆలయంలో జ్యోతి గాలికి అల్లలాడుతోంది. తళుక్కున మెరుపుతీగలు మెరిసినట్లు కనులు మిరుమిట్లుగొలుపుతూ పెద్ద కాంతిప్రజ్వరిల్లింది. ఇక శక్తి తనవశమయ్యే సమయమాసన్నమైనదని ఆనందంతో మాంత్రికుడు కేకలువేస్తున్నాడు. వెంటనే మెరుపుకాంతిలో దేవీ వామహస్తంలోని నాగాయుధం తృటిలో ఒక్క మెరుపు మెరిసి.... 'బుస్! బుస్!' మనే భయంకర శబ్ధంతో పెద్ద నాగసర్పం దేవి చేతిలోనుంచి సర్రున త్రిశూలంలా దూసుకొనివచ్చింది. సర్పాన్ని చూసి మాంత్రికుడు భయంతో బయటకు పరుగుపెట్టాడు. సర్పం వెంబడించింది.

గుడికి కొద్దిదూరం వెళ్ళేసరికి మాంత్రికునికి ఒక అపూర్వ స్త్రీ శక్తి ఎదురునిల్చి అడ్డుకొనింది. మాంత్రికుడు నోట మాట లేకుండా శక్తి ముందర నిలబడిపోయాడు. అంతే....ఆ అదృశ్యశక్తి తన వామపాదంతో మాంత్రికుడి ముఖంమీద ఒక్క చరుపు చరిచింది. కళ్ళు బైర్లుకమ్మాయి. శక్తి దెబ్బకు

మాంత్రికుని నోటిలో పళ్ళు మొత్తం వీడి క్రిందపడిపోయాయి. నెత్తురు క్రక్కుతూ కుప్పకూలిపోయాడు మాంత్రికుడు.

మరుదినం సూర్యోదయంతో గుడికివచ్చిన పూజార్లు మాంత్రికుడి దుస్థితిచూసి ధర్మకర్తకు తెలియపరిచారు. యీ సమాచారంవిని ప్రజలు గుంపులు గుంపులుగా చేరారు. ఆలయంలో ముగ్గులు, నిమ్మకాయలు, పసుపు కుంకుమలను చూసిన పూజార్లు, ధర్మకర్త, మాంత్రికుని దుశ్చర్యలను అర్థం చేసుకొని తల్లి అభిషేకజలం మాంత్రికుడి ముఖంమీద చల్లారు.

కొంతసేపటికి స్పృహలోకివచ్చిన మాంత్రికుడు నలువైపులా పరికించి చూసి అమాంతం ధర్మకర్త రెడ్డిగారి పాదాలు పట్టుకొన్ని, బోసినోటితో ఏడుస్తూ క్షమించమంటూ ప్రాధేయపడ్డాడు. కొంత సేద తీరిన పిమ్మట మాంత్రికుడు తాను శక్తిని ఉపాసించి వశపర్చుకోవాలనే దుష్టతలంపుతో ఇక్కడకు వచ్చినదిమొదలు జరిగిన సమాచారాన్ని ప్రజలందరిఎదుట రెడ్డికి తెలుపుతూ అపార దివ్యశక్తులు కలిగిన దేవి తనకు తగినశాస్తిచేసి కళ్ళు తెరిపించినదని ఏడుస్తూ రెడ్డి పాదాలను మరోమారు పట్టుకొన్నాడు.

దయార్ధ్రహృదయంతో రెడ్డి, మాంత్రికుని క్షమించవలసిందిగా దేవిని వేడ్కొని జాలిహృదయంతో మాంత్రికుని విడిచిపుచ్చి, యీప్రదేశం వదిలి వెళ్ళిపోవలసిందిగా హెచ్చరించి పంపివేసినట్లు.... ఒక వయోవృద్ధుని ద్వారా తెలిసినదీ ఉదంతం.

ఆలయాభివృద్ధికి సోపానాలు !

అరవభూమివంశం ఆధ్వర్యంలో మూడువందల సంవత్సరాలక్రితం ప్రారంభమైన శ్రీ చెంగాళమ్మ ఆలయప్రాభవం అరవభూమి వెంకురెడ్డిగారి కాలంలో బహుళప్రచారంపొందింది. భక్తుల ఆరాధ్యదేవతగా చెంగాళమ్మ ప్రతిష్ట దశదిశలా ప్రాకింది. శ్రీ వెంకురెడ్డిగారి కాలంలోనే శ్రీ చెంగాళమ్మ తిరునాళ్ళకు విశిష్ఠస్థానం ఏర్పడింది. వీరు 1905 వ సంవత్సరంలో తుదిసారి అమ్మవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించినట్లు తెలుస్తోంది.

శ్రీ వెంకురెడ్డిగారి నిర్యాణానంతరం వారి పుత్రులిద్దరూ పసివారు కావడంవల్ల వారి దగ్గరబంధువులైన కళత్తూరు వీరాస్వామిరెడ్డి అనేవారు 1912 వ సంవత్సరంలో యీ దేవాలయమునకు తాత్కాలిక ఆధిపత్యం వహించినట్లు. తర్వాత వెంకురెడ్డిగారి కుమారులిద్దరూ ప్రయోజకులుకాగానే పెద్ద కుమారుడు కృష్ణారెడ్డిగారు 1928 నుండి 1944 వరకు ఆలయ ధర్మకర్తగా వ్యవహరిస్తూ. తమ్ముడు రామచంద్రారెడ్డి సారధ్యంలో దేవీ కార్యక్రమాలు జరుపుతుండేవారు.

ఆకాలంలో వీరు షుమారు ఎనిమిది బ్రహ్మోత్సవాలు జరిపినట్లు తెలుస్తోంది. తర్వాత కృష్ణారెడ్డిగారు అనారోగ్యకారణాలతో అశక్తులైనందువల్ల వారి సోదరుడు అరవభూమి రామచంద్రారెడ్డిగారు 1945 నుండి 1960 వరకు దేవాలయ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తూ వైభవంగా బ్రహ్మోత్సవాలను జరిపేవారు. 1947వ సంవత్సరం జూన్ 27వ తేది, నాటి పార్లమెంటరీ సెక్రటరీ శ్రీ బి. ఎస్. మూర్తిగారి ఆధ్వర్యంలో ఈ ఆలయంలో హరిజన ప్రవేశం జరిగింది.

శ్రీ రామచంద్రారెడ్డిగారి హయాంలో 1955 సంవత్సరం కల్లేటి మునస్వామిశెట్టి పేరుతో ధర్మశాలను మొట్టమొదటసారిగా నిర్మించారు. ఇంకా ఆలయముఖ మండపము, కొత్త వాహనాలతోబాటు వాహనాల మండపము, అలంకార మండపము నిర్మాణాలు చేయించి, ఆలయాభివృద్ధికి కృషిచేస్తూ శ్రీ రామచంద్రారెడ్డిగారు తమ తండ్రి శ్రీ వెంకురెడ్డిగారిని మరిపించేలా, ఆలయ ధర్మకర్తగా, యీ ప్రాంతాల్లో ఒక ప్రముఖ వ్యక్తిగా చలామణిఅయ్యారు. వీరి ఆధ్వర్యంలో 1957 సంవత్సరం చివరిసారిగా బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి.

తొలిసారి అరవభూమివారి వంశంలో చంద్రారెడ్డి అనే వ్యక్తితో ప్రారంభమైన యీ దేవాలయ వంశపారంపర్య ధర్మకర్తృత్వం అయిదు తరాల అనంతరం చివరలో అరవభూమి రామచంద్రారెడ్డిగారితో అంతమైపోయి ప్రభుత్వవశమై దేవాదాయశాఖ ఆధ్వర్యంలోనికి వచ్చింది.

అలా ప్రభుత్వ పరమై దేవాదాయశాఖ నేతృత్వంలోకి వచ్చిన శ్రీ చెంగాళమ్మ ఆలయానికి ఏమాత్రం స్థిరాస్థులు, మడిమాన్యాలు లేకపోయినా అశేష భక్తులు దేవికి సమర్పించే మ్రొక్కుబడులు, కానుకల మూలంగానే ఆలయ నిర్వహణ జరుగుతుండడం విశేషం.

అలాగే ఇక్కడ దేవి వెలసిన నాటనుండి అమ్మవారి ఆలయ సేవలో ఎలాంటి నెలసరి వేతనాలు లభించకున్నా భక్తి భావంతో పూజా కార్యక్రమాలను చేపట్టిన సనిశెట్టి చెంచునారాయణశెట్టి, గున్నయ్యశెట్టి, చెంగయ్యశెట్టి, పాపయ్యశెట్టి, ఆదినారాయణశెట్టి మున్నగువారు కేవలం భక్తితత్పరతతో, నిస్వార్థ సేవాభావంతో దేవీ పూజా విధులను నిర్వర్తించేవారు. ఇప్పటికీ వారి వంశీయులే దేవీ ఆలయ పూజార్లుగా, తల్లి సేవ చేస్తున్నారు.

రెండున్నర దశాబ్దాల క్రితం కంచి కామకోటి పీఠాధిపతులు, జగద్గురు శ్రీ చంద్రశేఖర సరస్వతీ స్వామి, శ్రీ జయేంద్ర సరస్వతీ స్వాములవార్లు శ్రీ చెంగాళమ్మపరమేశ్వరీ దేవిని సందర్శించి, నిశితంగా పరిశీలించి, యిక్కడ వెలసియున్నదేవత గ్రామ శక్తికాదనీ, అర్థనారీశ్వరీ అవతారమని తమ అభిప్రాయం వెల్లడించారు.

రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో తొలి ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా శ్రీ కాళంగి రాజగోపాలశెట్టి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవములు ఆకర్షణీయంగా నిర్వహింపబడినవి.

1965 సంవత్సరం ఆలయ ఆవరణలో కల్యాణమండప నిర్మాణమునకు, భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిచే శంఖుస్థాపన మహోత్సవము వైభవంగా జరిపించారు. శ్రీ బాబాగారి పవిత్ర ఆశీస్సులతో కల్యాణమండప నిర్మాణం నిర్విఘ్నంగా పూర్తికాబడి నేడు ఎందరో భక్తులకు నిలయంగా.... దేవీ సన్నిధిలో కల్యాణ వేడుకలతో కలకలలాడుతున్నది.

అనంతరం శాసనసభ్యులుగా వున్న శ్రీ పిట్ల వెంకటసుబ్బయ్య ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా రెండుమార్లు బ్రహ్మోత్సవములను ఘనంగా జరిపించారు.

ఆ తర్వాత కాళంగి ప్రభాకర్ ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులై, నాటి పాలకవర్గ సభ్యులతో కలసి ఆలయ పునరోద్ధరణ కార్యక్రమములను చేపట్టి శాస్త్రోక్తంగా ముఖ మంటపం విస్తరణ, గోపుర నిర్మాణములు మున్నగు కార్యములను పూర్తి చేయించి ఆలయాన్ని ఆకర్షణీయంగా రూపొందించి ఉదారులైన అమ్మవారి భక్తుల ఆర్థిక సహకారములతో 1982 సంవత్సరం అత్యంత వైభవోపేతంగా మహా

కుంభాభిషేకము జరిపించారు. ఈ కుంభాభిషేకమునకు స్థానికుడు, ప్రస్తుతం మద్రాసు నివాసి, దేవిభక్తుడు చోళా ఎక్స్‌పోర్టర్స్ అధినేత శ్రీ జి. కణ్ణన్ ఉదారంతో విరాళమును సమర్పించి, మహా కుంభాభిషేక కర్తగా దేవీ కార్యక్రమములో భాగస్వాములు అయ్యారు.

కుంభాభిషేకం అనంతరం బ్రహ్మోత్సవములు వైభవంగా జరిగాయి.

వేనాటి సోదరుల ప్రవేశం!
శ్రీ చెంగాళమ్మకు స్వర్ణయుగం!

ఆలయ పునరోద్ధరణ, మహా కుంభాభిషేకముల అనంతరం శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీదేవిని పవిత్ర భక్తి శ్రద్ధలతో ఆరాధించే శ్రీ వేనాటి రామచంద్రారెడ్డిగారు ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా ఎన్నుకోబడి ఆలయ బాధ్యతలను స్వీకరించారు. వీరు తమ పాలకవర్గ సభ్యులు, దేవాదాయశాఖ అధికార్లతో కలసి ఆలయాభివృద్ధికి రూపకల్పన చేస్తూ....వదాన్యులైన దేవీ భక్తుల సహకార సంపత్తులతో ఎప్పటికప్పుడు ఆలయాన్ని భక్తుల అభిరుచులకు అనుగుణంగా రూపొందిస్తూ........నూతన పద్ధతులను ప్రవేశపెట్టి, దేవీపూజా కార్యక్రమములు ఎంతో ఆకర్షణీయంగా జరిగేలా అమలుపర్చారు.

ఒక దశాబ్దంనుండి శ్రీ చెంగాళమ్మ ఆలయ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కొత్తగా ప్రతి సంవత్సరం జనవరి 1 తేది నూతన సంవత్సర శుభోదయ వేడుకలను ప్రవేశపెట్టారు. అలాగే తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన శుభసందర్భములో అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు వేద మంత్రపఠనలతో ఆలయాన్ని ఎంతో ఆకర్షణీయంగా

ప్రత్యేక అలంకారశోభతో భక్తుల హృదయాల్లో పవిత్రభావం విలసిల్లేలా రూపొందించి ప్రత్యేక పద్ధతులతో జనాకర్షణీయంగా వేడుకలు జరిగేలా నాందీ పలికారు. అదే ప్రకారం.... దేవీ మూర్తికి అత్యంత ప్రధానమైన శరన్నవరాత్రి మహోత్సవములను పూర్వపు రోజులలో బ్రహ్మోత్సవ వేడుకలంత వైభవంగా పదిరోజులపాటు, రోజుకో ప్రత్యేక అలంకారముతో దేవిని అలంకరించి, భక్తులను విశేషంగా ఆకర్షించే విధంగా అనేక పూజా కార్యక్రమాలను రూపొందించి అమలుపరుస్తున్నారు.... 1985 సంవత్సరంలో శ్రీ రామచంద్రారెడ్డిగారి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ వేడుకలు మరపురాని విధంగా పెద్ద ఎత్తున జరిపించారు. ఆనాటి బ్రహ్మోత్సవములలో మహిషాసుర మర్ధన, తెప్పోత్సవ వేడుకలు జనాకర్షణీయంగా, వైభవోపేతంగా జరిపించి అమ్మణ్ణి ప్రతిష్టను పెంపొందించారు....

ఆ తర్వాత శ్రీ రామచంద్రారెడ్డిగారి సోదరులు ప్రజాహిత కార్యాలపట్ల మక్కువ కలిగిన శ్రీ వేనాటి మునిరెడ్డిగారు ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా బాధ్యతలను స్వీకరించారు. తమ సోదరుడు శ్రీ రామచంద్రారెడ్డితో కలిసి సంయుక్తంగా ఆలయ ప్రగతికి, యాత్రికుల వసతికి, అనేక నిర్మాణాలు చేపట్టి నిర్వహిస్తున్నారు. తమ్ముడు శ్రీ రామచంద్రారెడ్డి మదిలో మెదిలే వూహలకు సజీవ రూపకల్పనచేసి శ్రీ మునిరెడ్డిగారి నేతృత్వంలో అమలు పరచడం ప్రత్యేక విశేషం. వేనాటి సోదరులు తమ తండ్రిగారు స్వర్గీయ వేనాటి సుబ్బారెడ్డిగారి స్మృతి చిహ్నంగా అయిదు లక్షల రూపాయలకు పైగా స్వంతంగా వెచ్చించి ఎంతో కళాత్మైపుణ్యంతో భక్తులకు సుస్వాగతం పలుకుతున్న తీరులో నిర్మించిన విజయద్వారము శ్రీ చెంగాళమ్మ ఆలయ కిరీటంలో సరికొత్త కలికితురాయి.

ఇంకా ఆలయ ఆవరణకు ఆకర్షణీయంగా నిర్మించిన ప్రహరీ, కల్యాణ మండప ప్రవేశద్వారము, పరమేశ్వరీ ఉద్యానవనము.... ఆలయానికిఅత్యంత శోభను చేకూర్చి. అమ్మణ్ణి ప్రతిష్టకు మరింత ప్రచారం చేకూరుస్తున్నాయి. వదాన్యులైన దాతల విరాళాలతో యాత్రికుల వసతి గృహములు, స్టాఫ్ క్వార్టర్సు, కల్యాణమండప భోజనహాలు ఆలయానికి ఆకర్షణీయంగా శాశ్విత విద్యుత్ అలంకరణలతోబాటు భక్తులు క్రమశిక్షణతో దేవిని సందర్శించేందుకు కొత్తగా క్యూ కాంప్లెక్సు ఏర్పరచడం శ్రీ మునిరెడ్డిగారి నిర్మాణ దక్షతకు ప్రబల నిదర్శనం. అలాగే భక్తుల విరాళములతో ఆలయంలో పెద్దాపురం శిల్పులచే దేవీ చతుర్ధశ కళారూప ప్రతిమలను శోభాయమానంగా రూపొందించారు. వేనాటి సోదరుల సంయుక్త సారథ్యంలో గత నాలుగు సంవత్సరాల కాలంలో దాదాపు పన్నెండులక్షల రూపాయల వ్యయంతో ఆలయ ప్రాంగణము, ఆలయము రూపుదిద్దుకొనడం గమనార్హం!

అందుకే వేనాటి సోదరుల ప్రవేశం శ్రీ చెంగాళమ్మకు స్వర్ణయుగంగా అనేకమంది విజ్ఞులైన భక్తులు భావిస్తున్నారు.

వేనాటి వంశానికి వెలుగు జ్యోతులైన ఆదర్శసోదరులు శ్రీ మునిరెడ్డి శ్రీ రామచంద్రారెడ్డిగార్లు శ్రీ చెంగాళమ్మ ఆలయాభివృద్ధిని చేపట్టి అమలు పరుస్తున్న పలు కార్యాలు, శాశ్విత నిర్మాణాలు భావితరాలు స్పందించేలా శాశ్విత కీర్తి ప్రతిష్టలతో "నభూతో నభవిష్యతి" అనే విధంగా రూపొందినవి.

పురాతన పద్ధతులు....బ్రహ్మోత్సవ వేడుకలు!

శ్రీ చెంగాళమ్మ 'తిరునాళ్ళ' అనగానే ఈ ప్రాంతంలో ఎంతో సంచలనం కలుగుతుంది. వారం రోజులు జరిపే యీ వేడుకలు జనాకర్షణీయంగా పద్ధతుల ప్రకారం జరుగుతాయి.

తిరునాళ్ళ చేయాలని సంకల్పించినప్పుడు మొట్టమొదట ఓ నల్భై రోజులముందు ఒక శుక్రవారం ధర్మకర్త ఇంటిదగ్గరనుండి తప్పెట్లు, పంబజోళ్ళు మున్నగు వాయిద్యాలతో ఆలయానికి వెళ్ళి అమ్మణ్ణి అనుమతిని అర్థిస్థారు. పూర్వపు రోజులలో గణాచారి (చాకలి) మీద దేవి ఆవాహనకు వచ్చి అనుమతి యిచ్చేదనీ అయితే ఇప్పుడు అమ్మణ్ని నిమ్మపండు అభయం యిస్తుందనీ....ఆ అభయంతో తిరునాళ్ళకు అనుమతి లభించినట్లు భావించి సన్నాహాలు ప్రారంభమవుతాయి.

బ్రహ్మోత్సవములకు శుభముహూర్తం నిర్ణయించి, పదిహేను రోజుల ముందు ఒక శుక్రవారం అర్ధరాత్రి గ్రామంలోని ప్రతి గెమిడిలో ఫలపుష్పాదులు, పసుపు కుంకుమలతో పూజచేసి దిగ్బంధనం చేస్తారు. దీనిని "తొలి చాటు, మూగచాటు" అంటారు. దీనితో తిరునాళ్ళ ఖాయమైనట్లు భావం.

తర్వాత మరు శుక్రవారం రాత్రి తప్పెట్లు, తాళాలతో తిరునాళ్ళ జరుగుతుందని మలి చాటింపు జరుగుతుంది. తర్వాత మూడవ శుక్రవారం తెల్లవారు జామున అనగా గురువారం రాత్రి బలిహరణ, సుడిమాను ప్రతిష్ఠ జరుగుతుంది. శుక్రవారం అమ్మణ్ణికి అభిషేక పూజలు జరుగుతాయి. ఆ సాయంత్రం సుళ్ళ వుత్సవ వేడుక ప్రారంభమవుతుంది. యీ వుత్సవమునకు సమీపంలోని "గొల్లలములువు" గ్రామంలో ఒక రెడ్డి కుటుంబంనుండి ఒడిబాల, పసుపు కుంకుమలు వివిధ వాయిద్యాలతో తీసుకొని వస్తారు. అలాగే మన్నారుపోలూరునుండి పెద్దగొల్ల ఆధ్వర్యంలో గంగపెట్టి, వీరతాళ్ళతో కిలారింపులుచేస్తూ సుడిమానుకు కట్టే నల్ల మేకపిల్లను గొల్లలు తెస్తారు. ఇదే పురాతన సాంప్రదాయం. యిప్పటికీ అదే పద్ధతులు పాటిస్తున్నారు.

అనాదిగా అమ్మణ్ణి సేవకు నియమితులైన వెట్టి, చాకలి, మంగలి, కావలి, వడ్రంగి మున్నగు పనిబాపలవారందరూ అమ్మణ్ణి తిరునాళ్ళలో పాల్గొని నిస్వార్థంతో సేవలు చేస్తారు.

శుక్ర, శని, ఆది మూడు రోజులపాటు ప్రతి సాయంత్రం జరిగే సుడిమాను వేడుకలను వేలాదిమంది ప్రజలు ఉత్సాహంతో తిలకిస్తారు.

శుక్రవారం రాత్రి గుఱ్ఱపు వాహనంమీద శ్రీ చెంగాళమ్మ గ్రామోత్సవం జరుగుతుంది.

శనివారం రాత్రి "మహిషాసుర మర్ధన" వేడుకలు ప్రారంభమవుతాయి.

రాత్రి 9 గంటలకు 'సింహవాహనం' మీద శ్రీ చెంగాళమ్మ, గ్రామశక్తి అంకమ్మ గుఱ్ఱపువాహనంమీద ఆకర్షణీయమైన అలంకరణలతో బయలుదేరుతారు....ముందుగా భయంకర రూపంలోవున్న మహిషాసురుని విగ్రహాన్ని గ్రామంలో నలువీధులలో వూరేగించి ఆలయ సమీపంలో సింహవాహనారూఢయైన శ్రీ చెంగాళమ్మదేవికి ఎదురుగా తీసుకొని వస్తారు, దాంతో సమరం ప్రారంభమవుతుంది. శ్రీ చెంగాళమ్మ వాహనాలంకారం ముందు ధర్మకర్త పెద్ద పటాకత్తి చేతబట్టుకొని దేవీ ప్రతినిధిగా మహిషాసురునితో తలపడి.........రక్కసుని తల ఒక్క వేటుతో తెగ నరుకుతాడు. తల తెగిన మహిషుని మొండెం వెనుకకు వెళ్ళి మాయారూపుడై, మరల వివిధ క్రూర జంతురూపాలతో తొమ్మిదిమార్లు యుద్ధానికి సన్నద్ధుడై వచ్చిన మహిషుని తొమ్మిది తలలు సంహరించిన తర్వాత, భీకర స్వరూపంతో మహిషుడు దేవి ముందుకు వస్తాడు. ధర్మకర్త చేతిలోని కరవాలం తళుక్కున మెరుస్తూ మహిషుని తలను మొండెంనుండి వేరు చేస్తుంది. దీనితో యుద్ధ ఘట్టం పూర్తవుతుంది.

వెంటనే వివిధ ఆకర్షణలతో పెద్ద ఎత్తున విజయ చిహ్నంగా బాణసంచా వేడుకలు జరుగుతాయి. ప్రత్యేక పద్ధతుల్లో జరిగే యీ యుద్ధం

వేడుకలను తిలకించేందుకు అనేక ప్రాంతాలనుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనడం విశేషం. యుద్ధానంతరం, విజయదుర్గ అయిన అమ్మణ్ణి గ్రామోత్సవం వైభవంగా వుదయంవరకు జరుగుతుంది.

మరు రోజు ఆదివారం రాత్రి నందిసేవ గ్రామోత్సవం. ఆ రోజుతో మూడు రోజులపాటు సాయంత్రింపూట జరిగే సుళ్ళు వేడుకలు ముగుస్తాయి.

సోమవారం దేవి ఆవిర్భవించిన కాళంగి నదిలో అమ్మవారి విజయోత్సవంగా తెప్పోత్సవము వైభవోపేతంగా ప్రత్యేక బాణసంచా వేడుకలతో జరుగుతుంది.

ఈ తెప్పోత్సవమునకు వాటంబేడు గ్రామంనుండి మత్స్యకారులు రెండు నాటు పడవలను తెచ్చి తెప్ప అలంకరిస్తారు.

తిరునాళ్ళ వేడుకలలో సుళ్ళు వుత్సవములు, మహిషాసుర మర్ధన, తెప్పోత్సవములు అత్యంత ప్రధానమైనవి. యీ వుత్సవములలో ప్రత్యేకించి అనాదినుండి జరిగే బాణసంచా వేడుకలు ఎంతో ఆకర్షణీయంగా వుంటాయి.

మంగళవారం పుష్ప పల్లకీసేవ, గ్రామోత్సవం.

బుధవారం అసుర సంహారిణి అయిన అంబకు విశ్రాంతిసేవగా ఆలయ ప్రాంగణంలోనే శయనసేవ జరుగుతుంది. యీ వేడుకలలో అనేక సాంస్కృతిక ప్రదర్శనలు, బ్యాండు వాయిద్యాలు, గరగ నృత్యాలు, కీలుగుఱ్ఱములు, పూర్వం బుట్టబొమ్మలు ప్రధాన ఆకర్షణలు.

గురువారం సుడిమాను దింపుతారు. దీనితో తిరునాళ్ళ వేడుకలు ముగుస్తాయి.

శుక్రవారం గ్రామంలోని అన్ని వర్గాలవారు కులమతాలకు అతీతంగా మేళతాళాలతో వచ్చి ఆలయ ఆవరణలో పొంగళ్ళు పెట్టుకొని ఆ తల్లిని సేవిస్తారు. దీనినే చాటు పొంగళ్ళు అంటారు. ఆఖరురోజు ధర్మకర్త పని బాపల వారందరినీ యథోచితంగా సత్కరించి అభినందిస్తారు.

ఈ వారం రోజులు యీ ప్రాంతంలో ప్రతి కుటుంబంలో ఒక ముఖ్య పండుగలా బంధుమిత్రులతో కలకలలాడుతుంటుంది. నాటినుండి జరిగే తిరునాళ్ళ తంతు నేటికికూడా పూర్వాచార సాంప్రదాయానుసారం క్రమపద్ధతులలో జరగడం విశేషం—

నా భావనలో దేవీ ఆలయం!

ఈనాడు శ్రీ చెంగాళమ్మ ఆలయం నవ్య కళారూపాలతో కళకళలాడుతూ రూపొందిన తీరు ప్రశంసనీయం. ముఖ్యంగా ఆలయ ఆవరణకు బ్రహ్మాండమైన ప్రహారీ ఏర్పడింది. దీనికి మూడు ప్రవేశ ద్వారాలు ఏర్పడడం యాదృచ్ఛికమే అయినా, నా భావనలో ఆ తల్లి సంకల్పసిద్ధివల్లనే యీ మూడు ద్వారాలు శోభాయమానంగా కళావిలసితంగా రూపొందాయనుటలో అతిశయోక్తిలేదు. ప్రధాన ప్రవేశ విజయద్వారం ఎంతో ఆకర్షణీయంగా ఆలయానికి శోభను చేకూరుస్తోంది. అటు కల్యాణ మంటప ప్రవేశద్వారము కళా నైపుణ్యంతో విరాజిల్లుతోంది. ఇటు పరమేశ్వరీ ఉద్యానవన ప్రవేశద్వారము భక్తుల ఆకర్షణకు మూలంగా రూపొందడం విశేషం. యీ మూడు ద్వారాలు ఏర్పడడంలో ఆ దేవీ సంకల్పం...ముగ్గురమ్మలకు మూలపుటమ్మ అయిన 'త్రికళా' రూపిణి శ్రీ చెంగాళమ్మ నిలయం కాబట్టి మూడు ద్వారాలు రూపొందాయని నా భావం.

దేవి ఆలయ అంతర్భాగంలో దేవీ చతుర్థశ కళా ప్రతిరూప ప్రతిమలు ఏర్పడడంకూడా ఆ దేవీ సంకల్పమే. మహిషాసుర సంహారార్థం త్రిమూర్తుల అంశము, వారి దేవేరులైన ఉమ, రమ, వాణీ మూర్తుల అంశములతోబాటు అష్టదిక్పాలకుల అంశాలతో తేజోమూర్తిగా ఉద్భవించిన దేవి అష్టాదశ భుజాలతో ఆవిర్భవించి, మహిషుని సంహరించి, లోకకల్యాణం గావించినదని పురాణ ప్రతీతి....పద్నాలుగు దేవతా అంశలతో ఆవిర్భవించినందునే ఆ దేవీ ఆలయంలో పద్నాలుగు కళారూప ప్రతిమలు రూపొందినట్లు భావించాల్సి వస్తోంది.

ఆలయంలో ప్రవేశించిన భక్తులు క్యూ కాంప్లెక్సులో క్రమపద్ధతిలో వెళ్తూ... సప్త మాతృకల కళారూపాలను సందర్శిస్తూవెళ్ళి తొలుత ఆలయం వాయివ్యంలో వున్న విఘ్నేశ్వరస్వామిని దర్శించి, అటునుండి ఈశాన్యంలోని కుమారస్వామికి నమస్కరించి, మరోవైపున్న సప్త మాతృకల దేవీ రూపాలను తిలకిస్తు, పులకించిన దేహంతో భక్తిభావంలో మునిగిపోయి, గర్భాలయంలో అభయమిస్తున్న కరుణామూర్తి శ్రీ చెంగాళమ్మను సేవించి తరించి వెలుపలకు వస్తూ శ్రీ చెంగాళమ్మ, అంకమ్మల ఉత్సవ మూర్తులకు నమస్కరించి, ప్రశాంత చిత్తంతో ఆలయ ఆవరణలోని మహావృక్షాన్ని సందర్శించి, ఆ సమీపంలోని నాగేంద్రుని పుట్టకు మొక్కుకొని విశ్రాంతిగా వుద్యానవనంలో మానసికోల్లాసంతో సేదదీర్చుకొంటారు భక్తులు.

కన్నుల పండువుగా కమనీయ, రమణీయ కళారూపాలతో వైభవంగా విలసిల్లుతున్న శ్రీ చెంగాళమ్మ ఆలయ శోభను ప్రతివ్యక్తి తిలకించి, దేవీ మూర్తిని సందర్శించి ఆ తల్లి పవిత్రమైన ఆశీస్సులతో శోభస్కరంగా వెలుగొందాలని నా ఆకాంక్ష!

— రచయిత.

సర్వేజనాః సుఖినోభవంతు
ఓం శాంతి శాంతి శాంతిః